ప్రజాశక్తి
సోమవారం 18 సెప్టెంబర్ 2023 8 పేజీలు


ప్రకాశం


బాపట్ల

వినాయక విగ్రహం కోసం వచ్చి..

- తిరిగి వెళ్తుండగా..
  ఆగి ఉన్న లారీని ఢీకొన్న బైక్
- ముగ్గురు యువకులు మృతి
- పమిడిపాడులో విషాదం



ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

వినాయక చవితి పండుగ సందర్భంగా వినాయక విగ్రహం కోసం వచ్చి.. తిరిగి వెళుతున్న ముగ్గురు యువకులు రోడ్డుప్రమాదంలో దుర్మరణం చెందారు. ఆగి ఉన్న లారీని బైక్ ఢీకొనడంతో ఆదివారం వేకువజామున నాగులుప్పలపాడు మండలంలోని మద్దిరాలపాడులోని జాతీయ రహదారిపై ఈ ప్రమాదం చోటుచేసుకుంది.

బాపట్ల జిల్లా, కొరిశపాడు మండలం పమిడిపాడు గ్రామానికి చెందిన మర్రిబోయిన మణికంఠ(21), బత్తిన అరవింద్(19), మర్రిబోయిన గోపి(28) ముగ్గురూ వినాయక విగ్రహం కొనుగోలు కోసం ఒంగోలు వెళ్లారు. ఒంగోలులో విగ్రహం కోసం అడ్వాన్స్ ఇచ్చారు. అక్కడి నుంచి తిరిగి.. ద్విచక్రవాహనంపై పమిడిపాడుకు అతివేగంగా వస్తున్నారు. మద్దిరాలపాడు వద్దకు వచ్చేసరికి అప్పటికే పంచర్లై.. ఆగి ఉన్న కంటైనర్ లారీని బైక్ వేగంగా ఢీకొంది. దీంతో ముగ్గురూ అక్కడికక్కడే మృతిచెందారు. ఈ ముగ్గురూ ముదరాస్ సామాజికవర్గానికి చెందినవారు. గోపీ హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. ఈయనకు భార్య, సంవత్సరం వయస్సు ఉన్న కుమార్తె ఉన్నారు. మణికంఠ డిగ్రీ వరకు చదివారు. ఉద్యోగ వేటలో ఉన్నాడు. ఈయన తండ్రి ఆర్టీసీ డ్రైవర్. అరవింద్ హైదరాబాద్‌లోని ఓ ఫెర్టిలైజ్ షాపులో పనిచేస్తున్నాడు. గోపి, అరవింద్ వినాయకచవితి పండుగకు పమిడిపాడుకు వచ్చారు. రోడ్డుప్రమాదంలో ఈ ముగ్గురూ మృతిచెందడంతో పమిడిపాడులో విషాదఛాయలు అలుముకున్నాయి. సమాచారం తెలుసుకున్న సిఐ భక్తవత్సలరెడ్డి ఘటనాస్థలాన్ని పరిశీలించారు. ప్రమాద వివరాలు సేకరించారు. మతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను ఒంగోలు జిజిహెచ్‌కు తరలించారు.


అరవింద్ (ఫైల్), గోపి (ఫైల్), మణికంఠ(ఫైల్)

'గొట్టిపాటి' పరామర్శ

ప్రమాద విషయం తెలుసుకున్న అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ హుటాహుటిన ఒంగోలులోని స్థానిక రిమ్స్ ఆస్పత్రి వద్దకు వెళ్లి.. మతుల కుటుంబాలను పరామర్శించి ఓదార్చారు, ప్రమాదానికి గల కారణాలను పోలీసులను అడిగి ▶ 2లో

స్వాతంత్య్రం వచ్చి 70 ఏళ్లు దాటినా..

గుక్కెడు మంచినీళ్లూ ఇవ్వలేరా.?

- 'వెలిగొండ' పరిధిలో పిసిపల్లిని చేర్చాలి
- సిపిఎం పాదయాత్ర సభలో
  ఎమ్మెల్సీ లక్ష్మణరావు

ప్రజాశక్తి-పిసిపల్లి

స్వాతంత్ర్య వచ్చి..70 ఏళ్లు దాటినా.. గుక్కెడు మంచినీళ్లు కూడా ఇవ్వలేని పరిస్థితుల్లో పాలకులు ఉన్నారని పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణరావు అన్నారు. పీసీపల్లి మండలంలో రోజురోజుకూ పెరుగుతున్న కిడ్నీ వ్యాధి తీవ్రతను గురించి శాసనమండలిలో ప్రస్తావిస్తానని చెప్పారు. వెనుకబడిన ప్రకాశం జిల్లా అభివృద్ధి కోసం రూ.పది వేల కోట్లు కేటాయించి.. అభివృద్ధి చేయాలని సిపిఎం చేపట్టిన పాదయాత్ర ఆదివారం ఉదయం పీసీపల్లి మండలంలోని పెదఅలవలపాడుకు చేరింది. పిడిఎఫ్ తరఫున సిపిఎం చేపట్టిన పాదయాత్రకు సంఘీభావం తెలిపిన లక్ష్మణరావు వారితో కలిసి పాదయాత్రలో నడిచారు. ఈ సందర్భంగా మండలవాసులు కలుషిత నీరు తాగటం వల్ల కిడ్నీ వ్యాధులు ప్రబలుతున్నాయని మంచినీటిని ఇప్పించాలని ఆయనకు అర్జీలు ఇచ్చారు. ఈ సందర్భంగా పెదఅలవలపాడులో సిపిఎం కనిగిరి డివిజన్ నాయకులు బడుగు వెంకటేశ్వర్లు అధ్యక్షతన ఏర్పాటుచేసిన సభలో ఎమ్మెల్సీ లక్ష్మణరావు మాట్లాడారు. పాదయాత్రలో కిడ్నీ రోగుల మాటలు విని.. మనసు చలించిందన్నారు. మండలంలో అనేక గ్రామాల్లో ప్రజలు కిడ్నీ వ్యాధులతో బాధపడుతున్నారని చెప్పారు. వెలిగొండ ప్రాజెక్టు పరిధిలో పీసీపల్లి చేర్చాలని, కిడ్నీ సమస్యల పరిష్కారం కోసం తన వంతు కర్తవ్యంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మండలంలో నీళ్లలో ఫ్లోరోసిస్ అధికంగా ఉండటం వల్ల, విష రసాయనాలు అధికంగా వుండటం వల్ల ఈ వ్యాధులు ప్రబలుతున్నాయని చెప్పారు. సిపిఎం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్ మాట్లాడుతూ నిమ్జ్‌కు నిధులు కేటాయించాలని, పనులు వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. 2009లో కేంద్ర ప్రభుత్వం నిమ్జ్‌ను ఏర్పాటు చేసినప్పటికీ ఇంతవరకు దానికి నిధులు కేటాయించలేదని, పనులు జరగలేదని చెప్పారు. ప్రభుత్వం నిమ్జ్ పనులు చేపడితే పీసీపల్లి మండలవాసులు వేల మందికి ఉపాధి దొరుకుతుందని చెప్పారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జివి. కొండారెడ్డి మాట్లాడుతూ పాలేటి గంగమ్మ గుడి ఆవరణను పర్యాటక ప్రాంతంగా అభివద్ధి చేయాలన్నారు. గుడి వద్ద విశాలమైన స్థలం ఉందని అందులో ఈ మండల వాసి అమరజీవి పొట్టి శ్రీరాములు ▶ 2లో


ఎమ్మెల్సీ లక్ష్మణరావుకు, సిపిఎం బృందానికి అర్జీ ఇస్తున్న కిడ్నీ వ్యాధి బాధితులు


సిపిఎం పాదయాత్రలో పాల్గొన్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు

'స్వర్ణ' గణపతి.!



వినాయక చవితి సందర్భంగా ప్రకాశం జిల్లా, శింగరాయకొండలోని రైల్వే రోడ్‌లో ప్రత్యేకంగా బంగారు వర్ణంలో ఉన్న వినాయకుడిని ఏర్పాటు చేశారు. ఆర్యవైశ్య గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఈ ఏడాది 31వ వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటుచేసిన ఈ విగ్రహం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

- ప్రజాశక్తి, శింగరాయకొండ

ప్రజల హక్కులను

కాలరాస్తున్న ప్రభుత్వం

- ఉద్యమాలను అణిచివేస్తే
  పర్యవసానం తప్పదు
- 25న విద్యుత్ ఛార్జీలపై ధర్నా
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ
  సభ్యులు రమాదేవి

ప్రజాశక్తి-బాపట్ల

చంద్రబాబు నాయుడు అరెస్టు సందర్భంగా రాష్ట్రంలో అనేక చోట్ల ఉద్యమాలు చేస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం రాష్ట్రంలో 144 సెక్షన్, యాక్ట్ 30 సెక్షన్లు అమలు చేసి.. వందలాది మందిపై పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేయడం దేనికి సంకేతమని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి.రమాదేవి ప్రశ్నించారు. ప్రజల హక్కులను ప్రభుత్వం కాలరాస్తోందన్నారు. సిపిఎం బాపట్ల జిల్లా కార్యాలయంలో ఆదివారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. రాష్ట్రప్రభుత్వం తీవ్రమైన నిర్బంధాన్ని ఉపయోగించి.. ఉపాధ్యాయులు పెద్దఎత్తున లక్ష మందితో తలపెట్టిన ర్యాలీకి అనుమతి నిరాకరించి.. హక్కులను కాలరాస్తోందన్నారు. ప్రజాస్వామ్య హక్కులను హరించి వేస్తే రాష్ట్ర అభివద్ధి ఎలా సాధ్యమవుతుందన్నారు. ప్రజలందరి భాగస్వామ్యంతోనే రాష్ట్ర అభివద్ధికి దోహదపడుతుందన్నారు. ప్రజలు తమ సమస్యల్ని పాలకులకు చెప్పుకునే అవకాశం ఈ రాష్ట్రంలో లేదన్నారు. ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తూ ఉద్యమాలకు అడ్డుగోడగా నిలుస్తున్న రాష్ట్ర ప్రభుత్వ విధానాలను సిపిఎం తరఫున ఖండిస్తున్నామన్నారు. విద్యుత్ ఛార్జీలను పెంచేసి ప్రభుత్వం ప్రజలనెత్తిన భారం మోపుతోందన్నారు. దీనిపై సామాన్యులకు ప్రశ్నించే హక్కు ▶ 2లో


మాట్లాడుతున్న రమాదేవి

గుక్కెడు మంచినీళ్లూ ఇవ్వలేరా.?

(మొదటిపేజీ తరువాయి)

విగ్రహాన్ని, టంగుటూరు ప్రకాశం పంతులు విగ్రహాన్ని, పుచ్చలపల్లి సుందరయ్య విగ్రహాలని ఏర్పాటు చేయాలన్నారు. ఈప్రాంతం కాటమరాజు పరిపాలించిన ప్రాంతం కావున చారిత్రక ప్రాధాన్యత వుందన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కంకణాల ఆంజనేయులు మాట్లాడుతూ వెనుకబడ్డ ప్రకాశం జిల్లా అభివద్ధి కోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు వైసిపి, టిడిపి, జనసేన పార్టీలు అధికారం కోసం మాత్రమే పాదయాత్ర చేపట్టాయని చెప్పారు. సిపిఎం ప్రజల సమస్యలు తెలుసుకొని..వాటి పరిష్కారం కోసం పోరాడుతుందన్నారు. ఈ సందర్భంగా మండలంలోని పెదఇర్లపాడు దళితులు వారి గ్రామానికి రోడ్డును ఏర్పాటు చేయాలని, దివాకరపురం గ్రామస్తుల సాగర నీటిని రోజు ఇవ్వాలని, పిసిపల్లి, బుడ్డారెడ్డిపల్లి, విజయనగర్ కాలనీ, ఆదర్శనగర్ కాలనీ వాసులు రోజూ మంచినీటిని సరఫరా చేయాలని వినతిపత్రాలను పాదయాత్ర బందానికి ఇచ్చారు. ఈ పాదయాత్ర కార్యక్రమం రామాపురం నుండి పెదఅలవలపాడు, పాలేటి గంగమ్మ గుడి మీదుగా పొన్నలూరు మండలం పరుచూరివారిపాలెం వరకు కొనసాగింది. కార్యక్రమంలో వెల్లంపల్లి ఆంజనేయులు, కె.రమాదేవి, పి.కల్పన, బి.రఘురాం, వి.బాలకోటయ్య, డీకేఎం.రఫీ, కె.మాల్యాద్రి, సిహెచ్.వినోద్‌బాబు, జాలా అంజయ్య, పిసిపల్లి మండల సభ్యులు గుంటగాని యాకోబు, బడుగు జనార్ధన్ పాల్గొన్నారు.



ప్రమాద వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే గొట్టిపాటి

వినాయక విగ్రహం కోసం వచ్చి..

(మొదటిపేజీ తరువాయి)

తెలుసుకున్నారు. మృతదేహాలకు త్వరితగతిన పోస్టుమార్టం పూర్తి చేయించి.. కుటుంబ సభ్యులకు అందించాలని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జాతీయ రహదారిపై ఆగివున్న లారీని హైవే పెట్రోలింగ్ పోలీసులు పక్కకు తీసి ఉండినట్లయితే ఈ ఘోర రోడ్డుప్రమాదం సంభవించి ఉండకపోయేదేమోనని అన్నారు. మతుల కుటుంబాలకు తెలుగుదేశంపార్టీ అండగా ఉంటుందని చెప్పారు.

ప్రజల హక్కులను కాలరాస్తున్న ప్రభుత్వం

(మొదటిపేజీ తరువాయి)

లేదని ప్రభుత్వం నిర్బంధం విధిస్తోందన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో వినియోగించే విద్యుత్తుకు సైతం విద్యుత్ ఛార్జీల భారాలను ప్రజలపై మోపుతున్నారని చెప్పారు. విద్యుత్ సంస్థలకు చెల్లించాల్సిన మొత్తానికి.. వడ్డీని ప్రజల వద్ద నుండి ట్రూ అప్ చార్జీల రూపంలో వసూలు చేస్తోందన్నారు. వచ్చే నెల నుండి ప్రజలపై మరింత విద్యుత్ భారం పడబోతోందన్నారు. దీనిపై ఈ నెల 25న రాష్ట్రవ్యాప్తంగా వామపక్షాలతో కలిసి విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని కోరుతూ ధర్నాకు దిగుతున్నట్లు ఆమె ప్రకటించారు. 100 యూనిట్లు వినియోగించిన వినియోగదారులపై సైతం రెట్టింపు ఛార్జీలు మోపుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై ఈ నెల 25న జరిగే ధర్నాలో ప్రజలు పెద్దఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి సిహెచ్ గంగయ్య, జిల్లా కమిటీ సభ్యులు కష్ణమోహన్, జిల్లా నాయకులు మజుందార్, జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

శ్రీలక్ష్మి నరసింహ ట్రస్టుకు నంది అవార్డు

ప్రజాశక్తి-కొండపి: కాకతీయ పురస్కార నంది అవార్డుకు శ్రీ లక్ష్మి నరసింహ ట్రస్టును ఎంపిక చేశారు. ఆదివారం వరంగల్‌లో కన్నతల్లి ఫౌండేషన్ వారు లక్ష్మీ నరసింహ ట్రస్టును ఎంపిక చేసి ట్రస్టు చైర్మన్ కొండారెడ్డి, మెంబర్ సుబ్బారావులకు నంది అవార్డును అందచేశారు.

ఓట్లు వేసే యంత్రాలుగా బీసీలు

బిసి సంఘం జాతీయ అధ్యక్షుడు యనమల శ్రీనివాస్

ప్రజాశక్తి-కొండపి

బిసిలను ఓట్లు వేసే యంత్రాలుగా ఉపయోగించుకుంటున్నారే తప్ప బిసిలను రాజకీయంలో ముందుకు రానివ్వడం లేదని జాతీయ అధ్యక్షుడు యనమల శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం కొండపిలోని పొదిలి రోడ్డులో గుడిపల్లి చందు కళ్యాణ మండపంలో జాతీయ బిసి ప్రజా చైతన్య వేదిక ఆధ్వర్యంలో బిసి కమిటీ సమావేశం నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా జాతీయ అధ్యక్షుడు యనమల శ్రీనివాస్ పాల్గొని మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థలల్లో బిసిలకు రాజకీయ రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. బిసిలను గ్రామ గ్రామాన చైతన్య పరుస్తూ ముందుకు సాగాలని ఆయన కోరారు. బిసిలకు రావాల్సిన సంక్షేమ పథకాలు వెంటనే అందచేయాలని అన్నారు. అనంతరం కొండపి బిసి కమిటీ జరిగింది. కొండపి నియోజకవర్గ అధ్యక్షుడుగా తన్నీరు వెంకటేశ్వర్లు, జిల్లా వైస్ ప్రెసిడెంట్ తన్నీరు సుబ్బారావు, పల్లాపు కోటేశ్వరరావు, కొండపి నియోజకవర్గ సెక్రటరీ, కార్మిక విభాగంలో గౌరవ అధ్యక్షురాలుగా బిరుదుల సంధ్యారాణిని ఎన్నిక చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ కాపిటల్ అధ్యక్షుడు తన్నీరు రమణయ్య, జిల్లా అధ్యక్షుడు నూతలపాటి రమేష్, డిబిఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కొండ్రు కోటయ్య, మార్టూరు శ్రీను, వై మాధవరావు, తన్నీరు శ్రీనువాసులు, తన్నీరు మాలకొండయ్య, తన్నీరు ఆంజనేయులు, కుంచాల లక్ష్మయ్య, పల్లాపు విజయలక్ష్మి, కొండపి మహిళ అధ్యక్షురాలు టి రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

79 విగ్రహాలకు పర్మిషన్లు

ప్రజాశక్తి-కొండపి: కొండపి సర్కిల్ పరిధిలోని కొండపి, పొన్నలూరు, మర్రిపూడి మండలాల నుంచి వినాయక చవితి సందర్భంగా 79 వినాయక విగ్రహాలకు పర్మిషన్ల కోసం వచ్చినట్లు కొండపి సిఐ పాండురంగారావు తెలిపారు. ఆదివారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వినాయక విగ్రహాల మండపాలకు అనుమతుల కోసం కొండపి మండలం నుంచి 28, మర్రిపూడి-36, పొన్న లూరు -15 అర్జీలు వచ్చాయని తెలిపారు. విగ్రహాలు ఏర్పాటు చేసిన ప్రదేశాల్లో రాత్రి వేళల్లో మండపాల వద్ద విధిగా ఆర్గనైజింగ్ కమిటీ ప్రతినిధులు కాపలా ఉండాలని అన్నారు.

కలగానే మిగిలిన సంగమేశ్వరం

ప్రజాశక్తి-సింగరాయకొండ



సంగమేశ్వరం ప్రాజెక్టు

అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జలయజ్ఞంలో భాగంగా మొదలుపెట్టిన పొన్నలూరు మండలం సంగమేశ్వరం ప్రాజెక్టు అప్పుడు నుంచి ఇప్పుడు దాకా అలాగే కలగానే మిగిలిపోయి ఉంది. అప్పుడు బడ్జెట్ 50 కోట్ల 50 లక్షల రూపాయలు అంచనాలతో మొదలుపెడితే ఇప్పుడు బడ్జెట్ 200 కోట్లు రూపాయలకే అవకాశాలు ఉన్నాయని, ఆ ప్రాజెక్టును ప్రభుత్వాలు గాలికి వదిలేశాయి. 26-2-2009న కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు అప్పటి శాసనసభ్యులు పోతుల రామారావు ఆధ్వర్యంలో ఆర్థిక శాఖ మంత్రిగా ఉన్న కొణిజేటి రోశయ్య ఆధ్వర్యంలో 50 కోట్ల 50 లక్షల రూపాయల అంచనాతో పోతుల చెంచయ్య పాలేరు రిజర్వాయర్ సంగమేశ్వరం ప్రాజెక్టు స్పిల్ వేకి శంకుస్థాపన చేయడం జరిగింది. కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో కొంత పనులు నిర్వహించారు. ఆ పనులు కోరమండల్ సంస్థ టెండర్ తీసుకొని మొదలుపెట్టింది. చివరి క్షణంలో మొదలుపెట్టిన ఈ పనులు. కొంతమేరకు రెండు వైపులా కట్ట నిర్మాణం చేపట్టి భూములకు నష్ట పరిహారాలు రైతులకు అందజేసే కార్యక్రమం జరిగింది. ఆ సమయంలో పెద్దఎత్తున కాంగ్రెస్ పార్టీ నాయకులు బాగ్రెడ్డిపాలెం మంగినపాడు కొత్తపాలెంకు చెంది ఉన్నప్పటికీ పొన్నలూరు మండలంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు పెద్దఎత్తున భూములు ఉన్నాయని లక్షల రూపాయలు దోచుకుని జేబులో నింపుకున్నారు. అప్పటి పత్రికల్లో కథనాలు వచ్చిన రెవెన్యూ అధికారుల ప్రమేయం కూడా ఉండడంతో సైలెంట్ అయిపోయారు. ఆ తర్వాత జీవి శేషు శాసనసభ్యులుగా వచ్చిన తర్వాత ప్రాజెక్టును మరోసారి టెంకాయ కొట్టి అలా ముందుకు తీసుకుపోయారు. ఆ టెంకాయ కొట్టిన చోట కూడా అప్పుడు మట్టి తీయలేదు. ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీ అధికారాన్ని కోల్పోయి తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత కొండపి నియోజకవర్గంలో ఉన్న ఈ ప్రాజెక్టు శాసనసభ్యులుగా డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి ఉన్నప్పటికీ ప్రాజెక్టును శివరాత్రి సమయంలో సందర్శించి పోవడం తప్ప ప్రాజెక్టుకు ఒక్క రూపాయి కూడా తీసుకురాలేదు. సంగమేశ్వరం ప్రాజెక్టును పూర్తి చేయాలని తెలుగుదేశం పార్టీలో అనుకున్నప్పటికీ ఎన్నికల హామీ ఇచ్చినప్పటికీ అది జరగకుండా అలాగే ఆగిపోయింది. ఆ తర్వాత వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత అప్పుడు కూడా ఎన్నికల సమయంలో తెలుగుదేశం వైసీపీ నాయకులు వారి మేనిఫెస్టిలో సంగమేశ్వరం ప్రాజెక్టును పూర్తి చేస్తామని, ఆ ప్రాంత ప్రజలకు హామీ ఇచ్చారు. ఇక్కడ శాసనసభ్యులుగా తెలుగుదేశం పార్టీ నుంచి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి గెలుపొందారు. వైసిపి కొండపిలో ఓడిపోవడంతో సమన్వయకర్తగా ఉన్న డాక్టర్ మాదాసి వెంకయ్య సంగమేశ్వరం ప్రాజెక్టును పూర్తి చేయాలని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి జిల్లాకు వచ్చినప్పుడల్లా వీళ్లంతా అమరావతి వెళ్లినప్పుడల్లా వినతి పత్రాలు ఇచ్చుకోవడమే సరిపోయింది. ఆ తర్వాత ఇన్‌చార్జిగా వరికూటి అశోక బాబు రావటంతో గడప గడపకూ మన ప్రభుత్వంలో భాగంగా ఆ ప్రాంతాల్లో తిరిగేటప్పుడు సంగమేశ్వరం ప్రాజెక్టును పూర్తి చేస్తానని హామీ ఇచ్చారు. ఈయన కూడా జిల్లాకి ముఖ్యమంత్రి వచ్చినప్పుడు అదే వినతిపత్రాలు కొనసాగించారు. సంగమేశ్వరం ప్రాజెక్టు పూర్తి అవ్వటం ద్వారా 9500 ఎకరాలకు సాగునీరు అందుతుంది. నిత్యం పంటలు పండించుకునే పరిస్థితి వస్తుంది. ప్రస్తుతం అటవీ ప్రాంతంగా ఉన్న ఈ భూములు రైతులు వ్యవసాయం చేసే విధంగా మారుతుంది. 15 గ్రామాలకు తాగునీటి కోసం అల్లాడిపోతున్న పరిస్థితి ఇప్పుడు ఉంది. ఈ ప్రాజెక్టు పూర్తవడంతో 15 గ్రామాల ప్రజలకు 24 గంటలు తాగునీరు అందించే విధంగా ఈ ప్రాజెక్టు మారుతుందని రైతులు చెబుతున్నారు. సిపిఎం పార్టీ నాయకులు కేజీ మస్తాన్, టంగుటూరు రాము, వేసుపోగు మోజెస్ సిపిఎం పార్టీ పాదయాత్రలో భాగంగా సంగమేశ్వరం ప్రాజెక్టును సందర్శించారు. ప్రభుత్వాలు దీనిపై ఆలోచన చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు.



ఆగిన కట్ట నిర్మాణం



కాంగ్రెస్ హయాంలో వేసిన శిలాఫలకం



ట్రాక్టర్‌పైకి ఎత్తిన వినాయక విగ్రహాలు

గ్రామాలకు తరలిన గణనాథులు

ప్రజాశక్తి-కొండపి

వినాయకచవితి పండుగ సందర్భంగా ఆదివారం గణనాథుడు విగ్రహాలను కొనుగోలు చేసిన విగ్రహ నిర్వాహక కమిటీ వారు గ్రామాలకు తరలించారు. ఈ సందర్భంగా విగ్రహాల తయారీ కేంద్రం వద్ద పండుగ వాతావరణం నెలకొంది. దీంతో కొండపితోపాటు మర్రిపూడి, జరుగుమల్లి, పొన్నలూరు, సంతనూతలపాడు, చీమకుర్తి మండలాలోని గ్రామాలకు చెందిన విగ్రహాల కొనుగోలుదార్లు అక్కడకు చేరుకుని తాము ముందుగా బుక్ చేసిన విగ్రహాలను ట్రాక్టర్‌లపై ఎక్కించుకుని తీసుకు వెళ్లారు. రూ.6000 దగ్గర నుంచి రూ.23 వేల వరకు ఒక్కొక్క విగ్రహం ధర పలికింది. వాటిని రంగులు చల్లుకుంటూ యువకులు బాణసంచా కాలుస్తూ గ్రామాలకు తరలించారు. దీంతో కొండపిలో తిరునాళ్ల వాతావరణం సంతరించుకుంది. అలాగే కొండపిలోని జెండా చెట్టు సెంటర్‌లో మట్టితో తయారు చేసిన వినాయక విగ్రహాలను కొందరు తయారు చేసి విక్రయించారు. ఒక్కొక్క దాని విలువ రూ.30 దగ్గర నుంచి రూ.50 వరకు పలికింది.

ఖరీఫ్‌పై నీలినీడలు

- పంటల సాగు ప్రశ్నార్థకం
- ఊరిస్తున్న మేఘాలు
- నీరు లేక ఎండుతున్న పంటలు
- నష్టాల బాటలో రైతులు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

ఖరీఫ్ సీజన్ ప్రశ్నార్థకంగా మారింది. ఆలస్యంగా వర్షాలు వచ్చినా ఆశాజనకంగా పంటల సాగు లేదని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. గత జూలైలో బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం తుఫాన్‌గా మారి కొన్ని ప్రాంతాల్లో వర్షాలు కురవడంతో రైతన్న కళ్లలో ఆనందం వెల్లువిరిసింది. ఆ ఆనందం పట్టుమని పది రోజులు కాకముందే రైతన్నకు కన్నీరుగా మారింది. ఆగస్టులో అక్కడక్కడ చదుముదురు చినుకులు పడ్డాయి. పంటకు కావాల్సినంత వర్షం కురవడం లేదు.

ఊరిస్తున్న మేఘాలు

ప్రతిరోజు మేఘాలు ఊరిస్తూ కనబడుతున్నాయి. దీంతో మంచి వర్షం కురుస్తుందని రైతన్నకు కుదటపడగానే మేఘాలు మాయమై వర్షం కురవడం లేదు. దీంతో రైతులకు మళ్లీ దిగులు తప్పడం లేదు. యర్రగొండపాలెం వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలోని యర్రగొండపాలెం, పుల్లలచెరువు, త్రిపురాంతకం, పెద్దదోర్నాల మండలాలు ఉన్నాయి. ఖరీఫ్ సీజన్ కోసం 31,760 హెక్టర్ల సాగుభూమి సిద్ధంగా ఉంది. ఇప్పటి వరకు కేవలం బోరు బావుల కింద, అక్కడక్కడ వర్షాధార భూమలు అరకొర వర్షాలకు 6,105 హెక్టర్లలో మాత్రమే ఇప్పటి వరకు సాగు చేశారు. వర్షాలు లేక ఆ పంటలు సైతం ఎండిపోతున్నాయి.



ఎండుతున్న పత్తి పంట

వలసలు తప్పవా..

ఈ ఏడాది వలసలు తప్పవా అంటే అవుననే చెబుతున్నారు అన్నదాతలు. జూన్,జులై, ఆగష్టు ముగిసి సెప్టెంబర్ నెల చివరికి చేరుకున్న ఇంతవరకూ వర్షాలు పడకపోవడంతో కుటుంబ పోషణ కూడా భారమైంది. మరోవైపు పంటలకు పెట్టుబడి కోసం వడ్డీ వ్యాపారుల ద్వారా తెచ్చుకున్న రుణం యమపాశంగా మారింది. కౌలు రైతుల దుస్థితి మరింత దిగజారింది. దీంతో చేసేదేమి లేక వలసలు వెళ్ళక తప్పదని రైతన్నలు ఆవేదనతో చెబుతున్నారు.

పనులు లేక వ్యవసాయ కూలీల అవస్థలు..

వర్షాలు కురవకపోవడంతో వ్యవసాయ కూలీల సైతం పనులు లేక అల్లాడుతున్నారు. గత సంవత్సరం జూన్, జులైలో మంచి వర్షాలు కురవడంతో వ్యవసాయ కూలీలకు మంచి డిమాండ్ ఉంది. కూలీ రూ.250 నుంచి రూ.300 పైగా ఇచ్చేవారని తెలిపారు. ఈ ఏడాది రూ.200 రూపాయలు కూడా ఇచ్చేవారుకరువయ్యారని వ్యవసాయ కూలీలు పేర్కొంటున్నారు. గత 15 రోజుల క్రితం కురిసిన అడపదడప వర్షాలకు వారం రోజులు వ్యవసాయ కూలి పనులు దొరికాయని తెలిపారు. వ్యవసాయ పనులు లేక పోవడంతో పస్తులుండాల్సి వస్తుందని వాపోతున్నారు.

పత్తి ఎండిపోతుంది

దూదేకుల గాలిబ్బి, రైతు, యర్రగొండపాలెం



ముందస్తు అదునులో పత్తి పంటను సాగు చేశా. మొదట్లో వర్షాలు కురినప్పుడు పైరు బాగా ఉంది. ఆ తర్వాత వర్షాలు ముఖం చాటేయడంతో పంట బెట్టకొచ్చింది. ఆకులన్ని ఎండిపోతున్నాయి. నాలుగైదు రోజుల్లో వర్షాలు కురవకపోతే పత్తి పైరు ఎందుకూ పనికి రాకుండా పోతుంది.

రెండుసార్లు విత్తనాలు నాటాం

బాశం రమణారెడ్డి, రైతు, మురారిపల్లి



వర్షాలు సక్రమంగా కురవకపోవడంతో నాటిన పత్తి విత్తనాలు మొలకెత్తలేదు. దీంతో తిరిగి వర్షం కురిస్తే మరోసారి విత్తనాలు నాటాల్సి వచ్చింది. అవి మొలకెత్తినా వర్షాలు లేక, బోర్లలో నీళ్ల రాక ఎండిపోతున్నాయి. ఈ ఏడాది రైతులకు ఇబ్బందులు తప్పవు. ఖరీఫ్ ముగిసే సమయం వచ్చినప్పటికీ పంటలే వేయకపోవడంతో ఈ ఏడాది సాగు కష్టమే.

వరి సాగయ్యేనా..?

- వర్షాభావంతో ఒట్టిపోయిన బోర్లు
- అందుబాటులో లేని సాగర్ నీరు
- ఎండుతున్న పంటలు
- రైతుల్లో ఆందోళన

ప్రజాశక్తి-త్రిపురాంతకం

సాగార్జున సాగర్ ఆయకట్టు పరిధిలో ప్రకాశం జిల్లాలో మొదట్లోనే ఉన్న మండలం త్రిపురాంతకం. సాగర్ జలాలు పుల్లలచెరువు మండలంలోని 83వ మైలురాయి వద్ద జిల్లాలోకి ప్రవేశిస్తాయి. సాగర్ నీరు ఆయకట్టు భూములకే కాకుండా త్రిపురాంతకం మండలంలోని అన్ని చెరువులకు, బోరు బావులకు సాగర్ జలాలు ఉపయోగపడతాయి. మండలంలో 49 వేల వ్యవసాయ భూమి ఉంది. అందులో సుమారు 30 వేల ఎకరాల్లో వరి సాగు చేస్తారు. గతేడాది సాగునీరు అందుబాటులో లేని కారణంగా 7 వేల ఎకరాల్లో మాత్ర వరి సాగు చేశారు. ఈ ఏడాది సాగర్ జలాలు రాకపోవడంతో 3 వేల ఎకరాల్లో మాత్రమే బోరు బావుల కింద వరి సాగు చేస్తున్నారు. ఎకరాలో వరి సాగు చేయాలంటే రూ. 40 నుంచి రూ. 50 వేల వరకూ పెట్టుబడి పెట్టాల్సి వస్తుంది. వర్షాభావం, సాగునీరు లేని కారణంగా పంట దెబ్బతిన్ని రైతులు నష్టాలకు గురికావాల్సి వస్తుంది. దీంతో రైతులు వరి సాగు వైపు ఆసక్తి చూపడం లేదు. వాణిజ్య పంటల వైపు మొగ్గు చూపుతున్నారు. ఫలితంగా వరిసాగు తగ్గుతోంది. పరిస్థితి ఇలాగే కొనసాగితే భవిష్యత్‌లో తిండి కూడా బియ్యం దొరికే పరిస్థితి ఉండదు. పాలకులు స్పందించి పంటలకు నీరు సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.



వరి నాట్లు వేసేందుకు దమ్ము చేస్తున్న దృశ్యం

బోర్లే ఆధారం

మేకపోతు చిరంజీవిరెడ్డి, రైతు, త్రిపురాంతకం



సాగర్ ఆయకట్టు కింద భూములున్నప్పటికీ ఈ ఏడాది పంటలకు సాగునీరు విడుదల చేయలేదు. బోర్లపై ఆధారపడి 150 ఎకరాల్లో వరి సాగు చేశారు. బోర్లలో నీరు వస్తేనే వరి పండుతుంది. లేకుంటే ఎండుతుంది. అయినప్పటికీ చేసేదేమీ లేక ఈ పాటికే ఎకరానికి రూ. 30 వేలు పెట్టుబడి పెట్టి వరినాట్లు వేశారు.

రెండో బోరు వేయించాం

చిలుకూరి నాసర్‌రెడ్డి, రైతు, త్రిపురాంతకం



ఉన్న బోరులో నీళ్ల రాకపోవడంతో రూ. 70 వేలు పెట్టి రెండో బోరు వేయించా. అందులోనూ నీరు గతుకుతు వస్తుంది. ఎకరంలో వరి పంట సాగు వేసేందుకు సిద్ధం చేశా. బియ్యం ధరలు ఆకాశానంటుతున్నాయి. వడ్లకు మాత్రం ధర పలకడం లేదు. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోంది.

నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి- కొమరోలు

మండల కేంద్రమైన కొమరోలులో మెడికల్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం ఆదివారం నిర్వహించారు.ఈ సందర్భంగా మెడికల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బాలు, ప్రధాన కార్యదర్శి శ్రీధర్ ఆధ్వర్యంలో మండల కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్య క్షుడిగా డాక్టర్ డాక్టర్ దివాన్ బాషా, ప్రధాన కార్యదర్శిగా రంగస్వామి, ట్రెజరీగా వెంకటరత్నం ఏకగ్రీవంగా ఎన్నికయారు. ఈ కార్యక్రమంలో మెడికల్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు

మట్టి విగ్రహాలు పంపిణీ

ప్రజాశక్తి-మార్కాపురం

వినాయక చవితి పర్వదినం సందర్భంగా మైత్రి రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో మట్టి విగ్రహాలను పంపిణీకి శ్రీకారం చుట్టింది. ఆ సంస్థ గౌరవాధ్యక్షుడు తాళ్లపల్లి వెంకటసత్యనారాయణ, సామాజిక కార్యకర్త నారాయణాచార్యులు ఆదివారం మట్టి విగ్రహాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మట్టి విగ్రహాలతో వేడుకలు జరుపుకోవాలని, పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు తడికమళ్ల శివకేశవ, కోశాధికారి పద్మావతి, సభ్యులు ఆదిత్య కేశవ, జహ్నవి పాల్గొన్నారు.

విశ్వకర్మ జయంతి

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

విరాట్ విశ్వకర్మను ఆదర్శంగా తీసుకొని ప్రతి ఒక్కరూ సన్మార్గంలో నడవాలని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ తెలిపారు. విశ్వకర్మ జయంతి సందర్భంగా యర్రగొండపాలెంలోని బ్రహ్మంగారి గుడిలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సురేష్ మాట్లాడుతూ సృష్టికి ముందే విరాట్ విశ్వకర్మ జన్మించారని తెలిపారు. సమాజానికి అవసరమైన వివిధ వృత్తులను ఆయన సృష్టించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి దొంతా కిరణ్ గౌడ్, జడ్‌పిటిసి చేదూరి విజయభాస్కర్, జిల్లా కో ఆప్షన్ సభ్యుడు సయ్యద్ షాబీర్ బాషా, వైసిపి మండల కన్వీనర్ కొప్పర్తి ఓబుల్‌రెడ్డి, వైసిపి నాయకులు ఐవి. సుబ్బారావు, సుబ్రమణ్యాచారి, వాసు, నర్రెడ్డి వెంకటరెడ్డి పాల్గొన్నారు.

పెద్ద దోర్నాల : స్థానిక పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి దేవాలయంలో విశ్వకర్మ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంచుల సుబ్రహ్మణ్యాచారి, బొడ్డోజు నాగేశ్వరాచారి, పసుమర్తి మల్లికార్జునాచారి, గురవాచారి, దార్ల శ్రీనివాసాచారి, ముత్తలూరి స్రపతి, ఆలయ పుజారి మునగంటి మల్లికార్జునాచారి, వడ్లమాని వీరయ్య, పోతురాజు శేషబ్రహ్మాచారి, ముత్తలూరి శివశంకరాచారి, ఉమామహేశ్వరా చారి, శీలావంతుల బ్రహ్మం, మునగంటి శివ, గురిజేపల్లి శ్రీనివాసాచారి, వడ్లమాని నాగమూర్తి, పాటి మల్లాకార్జునాచారి, పోతురాజు గోవిందయ్య తదితరులు పాల్గొన్నారు.



దుర్గంధం వెదజల్లు తున్న డ్రైయినేజీ

దుర్గంధం వెదజల్లుతున్న డ్రైనేజీలు

ప్రజాశక్తి-పుల్లల చెరువు

మండల కేంద్రమైన పుల్లలచెరువులోని డ్రైనేజీలు మురుగు నీటితో నిండి కంపు కొడుతున్నాయి. పారిశుధ్య కార్మికులు డ్రైనేజీని శుభ్రం చేయకపోవడంతో చెత్తా చెదారాలు నిండిపోయి దోమలకు నిలయాలుగా మారాయి. వీధుల వెంట నడవాలంటే ముక్కులు మూసుకొని వెళ్లాల్సి వస్తోంది. నెలల తరబడి డ్రైనేజీలు శుభ్రం చేయకపోవడంతో ఈ పరిస్దితి నెలకొందని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మురుగు కాలువలు శుభ్రం చేయించి పారిశుధ్యాన్ని మెరుగు పరచాలని వారు కోరుతున్నారు.



గడప గడపకు కార్యక్రమంలో మంత్రి మేరుగ నాగార్జున

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి - భట్టిప్రోలు

అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పదకాలు అందజేస్తున్నట్లు సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున, బాపట్ల అర్బన్ డెవలప్మెంట్ కమిటీ ఛైర్మన్ దేవినేని మల్లికార్జునరావు అన్నారు. పట్టణంలో ఆదివారం గడప గడపకు ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. సిఎం వైఎస్ జగన్‌కే సంక్షేమ పాలన సాధ్యమని అన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేసి దేశంలో ఎక్కడా లేని విధంగా సిఎం జగన్ ప్రజల మన్ననలు పొందుతున్నట్లు చెప్పారు. అర్హత ఉండి పథకాలు అందని వారు వాలంటీర్ల ద్వారా దరఖాస్తు చేసుకొని పొందవచ్చునని సూచించారు. అద్దేపల్లి దళితవాడలో బడుగు గోపి అనే టిడిపి కార్యకర్త వైసీపీ కార్యక్రమాలు నచ్చటంతో మంత్రి సమక్షంలో వైసిపిలో చేరారు. కార్యక్రమంలో సర్పంచ్ రవికిరణ్మయి, ఎంపీపీ డివి లలిత కుమారి, జడ్పిటిసి ఉదయభాస్కరి, నాయకులు వేల్పూరి బాలసుబ్రమణ్యం (చిన్నారి), వేల్పూరి నాగేశ్వరరావు, సూర్య పల్లి, పిఎసిఎస్ ఛైర్పర్సన్ గోవర్ధనగిరి శేషాచల శ్రీనివాసరావు, నాయకులు మల్లేశ్వరరావు, బాలాజీ, ఎల్లమంద, కుందేటి రమేష్, కౌతరపు శ్రీనివాసరావు, రెహమాన్ ఉన్నారు.



ఎస్‌డబ్ల్యుఎఫ్ జెండా ఆవిష్కరిస్తున్న ఆర్టీసీ నాయకులు

ఎస్‌డబ్ల్యూఎఫ్‌తోనే ఐక్య ఉద్యమాలు

ప్రజశక్తి - చీరాల

ఎస్‌డబ్ల్యూఎఫ్ ఆవిర్భావం జరిగాకే ఆర్టీసీలో ఐక్య ఉద్యమాలు పెరిగాయని యూనియన్ సీనియర్ నాయకులు బొమ్మిడి శ్రీనివాసరావు అన్నారు. ఆర్టీసీ ఎస్డబ్ల్యుఎఫ్ ఆవిర్భావ దినోత్సవం స్థానిక కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. డిపో కమిటీ అధ్యక్షులు కెబికె రెడ్డి జెండా ఆవిష్కరించారు. సిఐటియు పట్టణ కార్యదర్శి ఎం వసంతరావు మాట్లాడుతూ ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసినప్పటికీ ప్రభుత్వ ఉద్యోగుల తరహాలో రాయితీలు రావడంలేదని అన్నారు. ప్రభుత్వం ఆర్టీసీని నిర్వీర్యం చేస్తుందని అన్నారు. ట్రేడ్ యూనియన్ హక్కులను కాల రాస్తున్నారని అన్నారు. చేతి వృత్తి సంఘం నాయకులు పి కొండయ్య మాట్లాడుతూ ప్రతి సంఘానికి యాజమాన్యంతో మాట్లాడే హక్కు ఉందని అన్నారు. కేంద్ర కార్మిక సంఘాల ప్రతినిధులు విధిగా ఉంటారని అన్నారు. కార్మిక సమస్యలను కేంద్ర కార్మిక సంఘాలు వాటి నాయకులతో యాజమాన్యాల చర్చలు నిర్వహిస్తారని అన్నారు. సమస్యలు పరిష్కారం చేస్తారని అన్నారు. కార్మిక సంఘాలకు భారత రాజ్యాంగం కల్పించిన హక్కుని వివరించారు. ప్రభుత్వ రంగ సంస్థల్లో ఔట్సోర్సింగ్ కార్మికులకు కూడా ఈ హక్కులు వర్తిస్తాయని అన్నారు. చీరాల ఆర్టీసీలో హెయిర్ బస్ కార్మిక సమస్యలు పరిష్కారం చేయాలని కోరారు. వారితో సమస్యలు చర్చించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తులసిరావు, రాంబాబు, జయరావు, నాగిరెడ్డి పాల్గొన్నారు.

వైసిపి మండల అధ్యక్షునిగా బొడ్డు

ప్రజాశక్తి - వేటపాలెం



బొడ్డు సుబ్బారావు

వైసిపి బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని నూతనంగా వైసిపి మండల అధ్యక్షునిగా నియమితులైన బొడ్డు సుబ్బారావు అన్నారు. ఆయన విలేకరులతో ఆదివారం మాట్లాడారు. వైసిపి మండల అధ్యక్షుడుగా తనను ఎంపిక చేసిన ఇన్‌ఛార్జి కరణం వెంకటేష్ బాబుకి ధన్యవాదాలు తెలిపారు. ఆయన నియామకం పట్ల పలువురు అభినందించారు.

ఆయుర్వేద వైద్యశాలపై అధికారుల నిర్లక్ష్యం

- వైద్యశాల చుట్టూ మురుగునీళ్లు
- పట్టించుకోని అధికారులు
- రెగ్యులర్ వైద్యుడిని ఇవ్వాలని నివేదన

ప్రజాశక్తి - భట్టిప్రోలు



చుట్టూ మురుగునీరు చేరి నిరుపయోగంగా వైద్యశాల

గ్రామంలో 75ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన ప్రభుత్వ వైద్యశాల నేడు ప్రజలకు కనుమరుగయ్యే పరిస్థితి నెలకొంది. ప్రాథమిక వైద్యశాలలు లేని సమయంలో ఈ వైద్యశాల మండల ప్రజా నీకానికి ఏకైక వైద్యశాల. గతంలో అన్ని రకాల వ్యాధులకు ఇక్కడ చికిత్స అందించేవారు. ప్రాథమిక వైద్యశాలు ఏర్పాటు చేసిన అనంతరం దీనిని ఆయుర్వేద వైద్యశాలుగా మార్చారు. అప్పటి నుండి అనేకమందికి ఆయుర్వేద చికిత్సలు అందిస్తూ వచ్చింది. కానీ గత నాలుగైదు ఏళ్లుగా ఈ వైద్యశాలకు వైద్యులు లేక పోవడం, దూర ప్రాంతాల నుండి ఇన్చార్జిలుగా కేటాయించబడిన వాళ్లు ఎప్పుడొస్తారో తెలియని పరిస్థితిలో ప్రజలు కూడా వైద్యశాలను మర్చిపోయే స్థితి వచ్చింది. వైద్యశాల ప్రాంగణం పల్లపు ప్రాంతం కావడంతో పట్టించుకునే వాళ్లు లేక చుట్టు పక్కల వర్షం నీరు చేరి లోపలికి వెళ్లడానికి కూడా అవకాశం లేని విధంగా మోకాలి లోతు నీళ్లు నిలిచాయి. ఇప్పటికీ కొంతమంది ఆయుర్వేద వైద్యాన్ని నమ్ముకుని చికిత్సలు పొందుతుంటారు. కానీ వైద్యులు లేకపోవడంతో నిరాశకు గురవుతున్నారు. ఇప్ప టికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు వైద్యశాలపై దృష్టి సారించి శాశ్వత వైద్యులను నియమించాలని, వైద్యశాల ప్రాంగణానికి మెరక తోలించి అభివృద్ధిపరిస్తే ప్రజలకు ఉపయో గపడుతుంది. వైద్యశాల అభివృద్ధి చేయాలని ప్రజాసంఘాల ప్రతినిదులు తహశీల్దారుకు వినతి పత్రం అందజేశారు.

బాపట్ల కళాకారుడికి అరుదైన పురస్కారం

- అమృత్ అవార్డుకు ఎంపికైన శ్రీ మన్నారాయణ శర్మ
- ఉపరాష్ట్రపతి చేతులు మీదుగా అవార్డు
- బాపట్ల సీమకే గర్వకారణమం: పలువురి ప్రశంస

ప్రజాశక్తి - బాపట్ల



శ్రీమన్నారాయణశర్మ



శ్రీమన్నారాయణశర్మకు అవార్డు అందజేస్తున్న ఉపరాష్ట్రపతి

పట్టణానికి చెందిన కూచిపూడి నాట్య కళాకారుడు మహంకాళి శ్రీమన్నారాయణ శర్మకు అరుదైన పురస్కారం లభించింది. భారత ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్కర్ చేతుల మీదుగా అమృత్ అవార్డును శర్మ అందుకున్నారు. భావపురి కళాకారుడి ప్రతిభకు దక్కిన పురస్కారంగా పలువురు శర్మను ప్రశంసిస్తున్నారు. అమృత అవార్డు గ్రహీత శ్రీమన్నారాయణ శర్మకు సంబంధించి ప్రజాశక్తి అందిస్తున్న సంక్షిప్త కథనం. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా కేంద్ర సంగీత, నాటక అకాడమీ దేశంలోని కూచిపూడి కళాకారుల్లో 8పదుల వయసున్న మహంకాళి శ్రీమన్నారా యణకు అమృత్ అవార్డును కేంద్ర ప్రభుత్వం బహుకరించింది. కృష్ణా జిల్లా కూచిపూడి మహంకాళి శ్రీమన్నారాయణ యక్షగాన చక్రవర్తి అయిన దివంగత మహంకాళి సత్యనారాయణ, కామాక్షమ్మలకు జన్మించారు. బాల్యం నుండి నాట్యంపై ఎంతో మక్కువ ఉండేది. చిన్నతనంలో ప్రహ్లాదునిగా అద్భుతమైన ప్రదర్శనలిచ్చి మహనీయుల మన్ననలు, సత్కీర్తిని పొందారు. 18వ ఏట బాపట్లకు వచ్చి స్థిరపడ్డారు. సత్య హరిశ్చంద్రలో లోహితాక్షుడుగా, మాతంగ కన్యలుగా, ఉషాపరిణ యంలో అనిరుద్ధునిగా, దవ్వారి కుడిగా, భామాకలాపంలో శ్రీకృష్ణుడిగా, సూత్రదారిగా, అంచెలంచెలుగా అనంత యశోభూషనుణ్డై యక్షగాన చక్రవర్తి సార్థక నామ ధేయులయ్యారు. వెంపటి చిన సత్యం నృత్య సంరక్షణలో రూపుదిద్దుకున్న క్షీరసాగర మధనంలో అద్భుతమైన ప్రతిభ చూపిన కళాకారుడుగా మహంకాళి గుర్తింపు పొందారు. నాట్యాచార్యుడుగా రాణించిన గురువు శ్రీమన్నారాయణ శర్మ తిరుగులేని స్థానాన్ని కైవసం చేసుకున్నారు. కూచిపూడి నాట్యకళలో దాదాపు 30వేల మంది శిష్యులను తయారు చేశారు. ఈయన శిష్యురాలు రమాదేవి హైదరాబాదు కేంద్రంగా నాట్య అకాడమీ స్థాపించి రెండు తెలుగు రాష్ట్రాల్లో విశిష్టమైన సేవలు అందిస్తున్నారు. శ్రీమన్నా రాయణ ప్రతిభకు దక్కిన అసలు సిసలైన గౌరవంగా పలువురు అభినందిస్తున్నారు. మహంకాళి కృషిని ప్రశంసిస్తున్నారు.

మణిపూర్ అల్లర్లను ముక్తకంఠంతో ఖండించాలి

గంగవరంలో రౌంట్‌టేబుల్ సమావేశంలో వక్తల వెల్లడి

ప్రజాశక్తి - ఇంకొల్లు రూరల్



రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న వై సిద్దయ్య

మణిపూర్‌లో క్రైస్తవులపై జరుగుతున్న అల్లర్లను, దాడులను అందరూ ముక్తకంఠంతో ఖండించాలని సిఐటియు రాష్ట్ర నాయకులు వై సిద్దయ్య పిలుపు నిచ్చారు. మండలంలోని గంగవరం శ్రీమంచాల రంగయ్య, రమణమ్మ కళ్యాణ మండపంలో ఆదివారం జరిగిన రౌండ్ టేబుల్ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి పెట్టుబడి దారులకు కొమ్ముకాస్తుందన్నారు. అక్కడున్న క్రైస్తవులు, గిరిజనులపై దాడులు చేసి అక్కడి నుండి తరిమేస్తే అక్కడున్న ఖనిజ సంపద కార్పోరేటర్లకు కట్టబెట్టేందుకు కేంద్రం పన్నాగం పన్నిందన్నారు. ఈ పాటికే అందరూ రోడ్లపైకి వచ్చి నిరసనలు తెలిపారని అన్నారు. రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వలేటి కృష్ణయ్య మాట్లాడుతూ మణిపూర్‌లో దారుణ హింసకు పాల్పడిన బిజెపికి ప్రజలు బుద్ధి చెప్పాలన్నారు. మతోన్మాదాన్ని రెచ్చగొట్టి దాడులు, అల్లర్లు చెలరేపేందుకు బిజెపి పన్నాగం పన్నిందన్నారు. భారత దేశంలో అందరూ సమానంగా జీవించే హక్కు మనకు రాజ్యాంగం ప్రసాదించిందన్న సంగతి గుర్తు చేశారు. సమావేశానికి రైతు సంఘం నాయకులు కందిమళ్ళ రామకోటేశ్వరరావు అధ్యక్షత వహించారు. సమావేశంలో అంజిరెడ్డి, ప్రసాద్, మార్కు, లింకన్, అంజయ్య, రవి, ప్రేమ్‌చంద్, వెంకటేశ్వర్లు, శ్రీనివాసు, కొర్నేలు, సుబ్బారావు, హనుమంతరావు పాల్గొన్నారు.

వైసీపీ రూరల్ అధ్యక్షునిగా ఆసాది

ప్రజశక్తి - చీరాల



ఆసాది అంకాళరెడ్డి

వైసిపి చీరాల రూరల్ అధ్యక్షులుగా అసాది అంకాళ రెడ్డిని అధిష్టానం నియమిస్తూ ప్రకటించింది. ఈ సందర్భం గా ఆయన ఒంగోలులోని ఎమ్మెల్యే కరణం బలమకృష్ణమూర్తిని నివాసంలో కలసి తమను నియమించటం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనను రూరల్ అధ్యక్షులుగా నియమించడంలో ప్రతిపాదించిన ఎమ్మెల్యే కరణం బలరాం, వైసిపి ఇన్చార్జి కరణం వెంకటేష్ బాబుకు అభినందనలు తెలిపారు. నియోజకవర్గంలో వైసిపి జెండా ఎగరవేసేందుకు కృషి అందర్నీ సమన్వయం చేస్తూ ముందుకు సాగుతామన్నారు. అంకాళరెడ్డిని పలువురు అభినందించారు.

వైసిపి పట్టణ అధ్యక్షుడు బాబ్జీకి ఘన సన్మానం

ప్రజశక్తి - చీరాల



వైసిపి పట్టణ అధ్యక్షులు1ను సన్మానిస్తున్న 33వార్డు ప్రజలు

వైసిపి పట్టణ అధ్యక్షుడిగా ఎన్నికైన కోండ్రు బాబ్జిని పట్టణంలోని 33వ వార్డు వైసిపి నాయకులు తలకాయల సుధాకర్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ వైసిపి ఏర్పడినప్పటి నుంచి పార్టీకి సేవలందించిన కోండ్రు బాబ్జికి అధ్యక్షుడిగా పదవి అందించడం ఎంతో ఆనందంగా ఉందని అన్నారు. మరింత ఉత్సాహంగా పనిచేసి సిఎం వైఎస్ జగన్ అమలు చేస్తున్న సంక్షేమ పదకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని అన్నారు. దేశానికే ఆదర్శంగా రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పదకాలు అర్హులకు అందించేందుకు కృషి చేయాలని అన్నారు. అధ్యక్షునిగా నియమించడంలో కృషి చేసిన ఎంఎల్ఎ కరణం బలరామకృష్ణమూర్తి, ఇన్‌ఛార్జి కరణం వెంకటేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈసందర్భంగా ఆయన్ని పూలమాలతో సత్కరించారు. స్వీట్లు పంపిణీ చేశారు. సన్మాన కార్యక్రమంలో గ్రామ పెద్దలు బడుగు భూషణం, గర్నెపూడి చంద్ర, బల్లికురవ సోలోమోను, గుజ్జర్లపూడి రూబేను, దావులూరి సురేష్, కొప్పుల చిన్న, ఏలియా, సురేంద్ర, భరత్, బింటు, డక్కుమల్ల బాబు, ఆనంద్, లాజర్, వంశీ, గిద్దోను పాల్గొన్నారు.

వైసీపీ పట్టణ అధ్యక్షునిగా మాధవరావు

ప్రజశక్తి - చీరాల



జి మాధవరావు

వైసిపి పట్టణ అధ్య క్షులు2గా గుంటూరు మాధ వరావు అధిష్టానం ప్రకటించింది. ఈసందర్భంగా ఆయన ఒంగోలులోని ఎంఎల్ఎ కరణం బలరామకృష్ణమూర్తి, వైసిపి ఇన్‌ఛార్జి కరణం వెంకటేష్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. పట్టణంలో పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. మాధవరావు నియామకం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

'పాలేరు' పై హైలెవల్ బ్రిడ్జి నిర్మించాలి

పాలేరును సందర్శించిన సిపిఎం బృందం

ప్రజాశక్తి-పొన్నలూరు

పరుచూరివారిపాలెం, కల్లూరి వారిపాలెం గ్రామాల మధ్యలో పాలేరునదిపై హైలెవల్ బ్రిడ్జి నిర్మించాలని సిపిఎం పోరుబాట-పాదయాత్ర బృందం డిమాండ్ చేసింది. ప్రకాశం జిల్లా అభివృద్ధికి రూ.10 వేల కోట్లు కేటాయించాలని, ప్రజల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టిన పోరుబాట-పాదయాత్ర బృందం కోరింది. ఈనెల 10న దొనకొండలో ప్రారంభమైన పాదయాత్ర ఆదివారం పొన్నలూరు మండలం పరుచూరి వారిపాలెంకు చేరింది. ఈ సందర్భంగా సిపిఎం కొండపి నియోజకవర్గ నాయకులు కెజి. మస్తాన్, వి.మోజేస్, టంగుటూరి రాము ఆధ్వర్యంలో పాదయాత్ర బృందానికి పూలమాలలు వేసి ఘన స్వాగతం పలికారు. అనంతరం పరుచూరి వారిపాలెం, కల్లూరి వారిపాలెం, కోటపాడు, బాలిరెడ్డి పాలెంలో ఏర్పాటు చేసిన సభలలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు, పాదయాత్ర బృందం నాయకుడు జివి.కొండారెడ్డి మాట్లాడారు. సంగమేశ్వర డ్యాం నిర్మిస్తున్న నేపథ్యంలో పరుచూరివారిపాలెం, కల్లూరి వారిపాలెం మధ్య ఉన్న పాలేరు నదిపై హైలెవల్ బ్రిడ్జి నిర్మిస్తామని హామీ ఇచ్చినా అమలు కాలేదు. సంగమేశ్వర డ్యాం నిర్మాణం పూర్తయితే ఈ ప్రాంతంలోని 10 గ్రామాలకు రహదారి సౌకర్యం లేకుండా పోతుందన్నారు. హైలెవల్ బ్రిడ్జి నిర్మిస్తామని ఇచ్చిన హామీ అమలు కోసం సిపిఎం పోరాడుతుందన్నారు. బాలిరెడ్డిపాలెం నుంచి కల్లూరివారిపాలెం వరకూ తారురోడ్డు కోసం రూ. 80 లక్షల కేటాయించి పనులు ప్రారంభించినట్లు గ్రామస్తులు తెలిపారు. పనులు మధ్యలో నిలిపి వేయడంతో తాము అవస్థలు పడుతున్నట్లు ఆయా గ్రామాల ప్రజలు తెలిపారు. ఈ సమస్యపై పాదయాత్ర బందానికి అర్జీలు అందజేసి పరిష్కరించే విధంగా చూడాలని కోరారు. పాదయాత్రలో జివి. కొండారెడ్డి, కంకణాల ఆంజనేయులు, వెల్లంపల్లి ఆంజనేయులు, కె. రమాదేవి, పి. కల్పన, బి. రఘురామ్, వి. బాలకోటయ్య, డికెఎం. రఫి, కె. మాల్యాద్రి, సిహెచ్. వినోద్, సిపిఎం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్, నాయకులు ఎం.రమేష్, కాలం సుబ్బారావు, బాల నాగయ్య తదితరులు పాల్గొన్నారు.



పాలేరును పరిశీలిస్తున్న సిపిఎం బృందం

పాదయాత్రను జయప్రదం చేయాలి

సిపిఎం మండల కార్యదర్శి పూసపాటి వెంకటరావు

ప్రజాశక్తి-చీమకుర్తి

సిపిఎం పోరుబాట - పాదయాత్రను జయప్రదం చేయాలని సిపిఎం మండల కార్యదర్శి పూసపాటి వెంకటరావు కోరారు. స్థానిక పంగులూరి కృష్ణయ్య భవనంలో సిపిఎం పట్టణ కమిటీ జనరల్ బాడీ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశానికి బి. వీరాంజనేయులు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పూసపాటి వెంకటరావు మాట్లాడుతూ పాదయాత్రలో భాగంగా ఈనెల 21 చీమకుర్తిలో బహిరంగసభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బహిరంగ సభలో సిపిఎం రాష్ట్ర నాయకురాలు డి.రమాదేవి పాల్గొంటారన్నారు. మండలంలో నిర్వహిస్తున్న పాదయాత్ర,బహిరంగ సభలో సిపిఎం కార్యకర్తలు, నాయకులు, సభ్యులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సిపిఎం పట్టణ నాయకులు టి.రామారావు,పి. ఓబులరెడ్డి,బి.ఓబులేషు, నాగయ్య,సిహెచ్. కొండయ్య, టి.ఎను, జి. శంకర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పూసపాటివెంకటరావు

విద్యార్థులు క్రమశిక్షణతో చదవాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్

విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలకు చేరుకొని తాము చదివిన కళాశాల, తల్లి దండ్రులకు మంచి పేరు తీసుకురావాలని గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు తెలిపారు. స్థానిక శ్రీ గౌతమి జూనియర్ కళాశాలలో ప్రిన్సిపల్ ఎస్వి. సత్యనారాయణ, కళాశాల చైర్మన్ కనుమర్ల గుండారెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు స్వాగత వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు మాట్లాడుతూ విద్యార్థులను తీర్చి దిద్దడంలో ఉపాధ్యాయులు నవ నిర్మాణ సారథులు తెలిపారు. మార్కాపురం మాజీ ఎమ్మెల్యే, వైసిపి జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తమ తల్లిదండ్రుల యొక్క కష్టాన్ని గుర్తెరిగి భాధ్యతాయుతంగా చదివి మంచి పేరు తెచ్చుకోవాలన్నారు. అనంతరం ఆటల పోటీల్లో గెలిపొందిన విద్యార్థులకు మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి చేతుల మీదుగా బహు మతులు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో అలరించాయి. ఈ కార్యక్రమంలో శ్రీ గౌతమి విద్యాసంస్థల చైర్మన్ కనుమర్ల గుండారెడ్డి డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ జివి. నారాయణరెడ్డి, అడ్వజర్ శ్రీనివాసరెడ్డి, కళాశాల ఇన్‌ఛార్జి కనుమర్ల శ్రీరామ్మి, బొంతల రామకృష్ణ, బాలకృష్ణా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జంకె


ఐదో రోజూ టిడిపి రిలే దీక్షలు

ప్రజాశక్తి - గిద్దలూరు

మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు అరెస్టు, రిమాండ్‌కు నిరసనగా టిడిపి ఆధ్వర్యంలో ఐదో రోజూ ఆదివారం రిలే నిరాహార దీక్షలు నిర్వహించారు. ఈ దీక్షల్లో కొమరోలు, బేస్తవారిపేట మండలాల టిడిపి నాయకులు కూర్చున్నారు. బద్వేలుకు చెందిన టిడిపి రితీష్ రెడ్డి దీక్షల్లో పాల్గొని సంఘీభావం తెలిపారు. అనంతరం రితీష్ రెడ్డి మాట్లాడుతూ మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రజలను వేధించటమే పనిగా పెట్టుకుందన్నారు. ప్రశ్నించే టిడిపి నాయకులపై అక్రమ కేసులు బనాయిస్తున్నట్లు తెలిపారు. ఓటమి భయంతో టిడిపి అధినేత చంద్రబాబు నాయుడుపై అక్రమ కేసులు బనాయించి రిమాండ్‌కు పంపారన్నారు. గిద్దలూరు మాజీ ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి మాట్లాడుతూ దేశంలోనే టెక్నాలజీని పరిచయం చేసిన వ్యక్తి చంద్రబాబు నాయుడని తెలిపారు. అభివద్ధి సంక్షేమం తప్ప, మచ్చలేని నాయకుడు చంద్రబాబు నాయుడును వైసిపి ప్రభుత్వం అక్రమ రిమాండ్ కు పంపటం దుర్మార్గమని తెలిపారు.రిలే దీక్షలలో కొమరోలు మండల టిడిపి అధ్యక్షుడు బోనేని వెంకటేశ్వర్లు యాదవ్, బేస్తవారిపేట మండల అధ్యక్షుడు సొరెడ్డి మోహన్ రెడ్డి, పూనూరు భూపాల్ రెడ్డి, ముత్తుముల సంజీవరెడ్డి, బిజ్జాల తిరుమల రెడ్డి, దూదేకుల సైదులు, ముప్పూరి రాము, షేక్ నభి, తాళ్ల శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. **మార్కాపురం :** కేంద్రం, రాష్ట్రంలోని పాలకులు ప్రతిపక్షాల గొంతు నొక్కాలనుకోవడం అవివేకమని సిపిఎం పట్టణ కార్యదర్శి డి.సోమయ్య తెలిపారు. చంద్రబాబు అరెస్ట్‌కు నిరసనగా టిడిపి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారమూ కొనసాగాయి. ఈ దీక్షలకు సిపిఎం పట్టణ కార్యదర్శి డి.సోమయ్య సంఘీభావం మాట్లాడారు. పాలకుల వైఫల్యాలపై ప్రతిపక్షాల నేతలు మాట్లాడలేని స్థితి ఏర్పడిందన్నారు. ఎన్నడూ లేని విధంగా ఆంక్షలు విధిస్తున్నారన్నారు. ప్రజా సమస్యలపై పోరాడే హక్కులు సైతం కాల రాస్తున్నారన్నారు. ఇది మంచి పద్ధతి కాదనేది పాలకులు తెలుసుకోవాలన్నారు. ఈ దీక్షల్లో టిడిపి మార్కాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, టిడిపి పట్టణ అధ్యక్షుడు షేక్ మౌలాలి, పట్టణ ప్రధాన కార్యదర్శి కొప్పుల శ్రీనివాసులు, ఎఎంసి మాజీ చైర్మన్ కాకర్ల శ్రీనివాసులు పాల్గొన్నారు. **యర్రగొండపాలెం :** టిడిపి జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడును అరెస్టు చేయడం దుర్మార్గమని టిడిపి పల్నాడు జిల్లా అధ్యక్షుడు బివిఎస్. ఆంజనేయులు తెలిపారు. చంద్రబాబు నాయుడు అరెస్టును నిరసిస్తూ టిడిపి నాయకులు చేపట్టిన నిరాహార దీక్షలు ఆదివారమూ కొనసాగాయి.ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ రాష్ట్రంలో అవినీతి విలయ తాండవం చేస్తుందన్నారు.టిడిపి నియోజక వర్గ ఇన్‌ఛార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు మాట్లాడతూ అక్రమ అరెస్టులకు భయపడేది లేదన్నారు.ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు వేములకొండ శ్రీనివాస్, డాక్టర్ మన్నె రవీంద్ర, చేకూరి సుబ్బారావు, ఏరువ మల్లికార్జునరెడ్డి, కామేపల్లి వెంకటేశ్వర్లు, శనగా నారాయణరెడ్డి, చిట్టేల వెంగళరెడ్డి, షేక్ మస్తాన్‌వలి, షేక్ ఇస్మాయిల్, షేక్ వలి, జిలాని, తోటా మహేష్ నాయుడు, షేక్ జిలాని, చేకూరి ఆంజనేయులు, వడ్లమూడి లింగయ్య, గోళ్ల సుబ్బారావు, మెడబలిమి అచ్యుతరావు, ప్రసాద్, లక్ష్మయ్య పాల్గొన్నారు.



గిద్దలూరులో దీక్షల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే అశోక్‌రెడి



మార్కాపురంలో మాట్లాడుతున్న సిపిఎం నాయకుడు సోమయ్య



పెట్రోల్ బంకులో ఎమ్మెల్సీ కెఎస్. లక్ష్మణరావు

నిరాడంబరతకు నిదర్శనంగా ఎమ్మెల్సీ లక్ష్మణరావు..

సాధారణంగా ఈ రోజుల్లో ఎమ్మెల్యే/ఎమ్మెల్సీ ఎక్కడికైనా వెళ్లారంటే ఎంత హడావుడి ఉంటుందో అందరికీ తెలిసిందే.. చుట్టూ అనుచరుల హడావుడి అంతాఇంతా కాదు. పిడిఎఫ్ ఎమ్మెల్సీ లక్ష్మణరావు నిరాడంబరత పెదఅలవలపాడు గ్రామస్తులను ఆదివారం ఆశ్చర్యానికి గురిచేసింది. పిడిఎఫ్ ఎమ్మెల్సీలంటే నిస్వార్థంగా ప్రజల కోసం పనిచేస్తారన్న విషయం తెలిసిందే.. సిపిఎం చేపట్టిన పోరుబాట - పాదయాత్రకు మద్దతు తెలిపేందుకు ఎమ్మెల్సీ కె.లక్ష్మణరావు ఆదివారం ఉదయం ఎనిమిది గంటలకే పిసిపల్లి మండలం పెదఅలవలపాడుకు వచ్చారు. పాదయాత్ర సభకు కాస్త సమయం ఉండటంతో అక్కడే రేకులషెడ్డులో తన డ్రైవర్‌తో కలిసి టిఫిన్ చేశారు. పక్కనే పెట్రోల్ బంకులో ఓ సాధారణ వ్యక్తిలా కూర్చొని పెట్రోల్ బంకు సిబ్బంది సమస్యలు తెలుసుకున్నారు. కాసేపటికి అక్కడికి సిపిఎం నేతలు వచ్చిన తర్వాత ఆయన ఎమ్మెల్సీ అని తెలిసి.. 'విద్యావేత్త లక్ష్మణరావు ఈయనేనా.. ఇంత నిరాడంబరంగా ఉన్నారేంటి?..' అని పెట్రోల్ బంకు సిబ్బందితో పాటు స్థానికులు ఆశ్చర్యం వ్యక్తం చేశారు.

- ప్రజాశక్తి, పిసిపల్లి



జార్జి ఘాట్ వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి డాక్టర్ సురేష్

శామ్యూల్ జార్జికి ఘన నివాళి

ప్రజాశక్తి-మార్కాపురం

జార్జి విద్యా సంస్థల వ్యవస్థాపకులు డాక్టర్ ఆదిమూలపు శామ్యూల్ జార్జి, థెరిసమ్మ లక్ష్యం కోసం పనిచేస్తామని పురపాలక శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ తెలిపారు. ప్రకాశం జిల్లాలో మొట్ట మొదటి ఇంజినీరింగ్ కళాశాలను అప్పట్లో అత్యంత వెనుకబడిన మార్కాపురంలో స్థాపించిన స్వర్గీయ డాక్టర్ ఆదిమూలపు శామ్యూల్ జార్జి ఈ ప్రాంత వెనుబడిన వర్గాల అభ్యున్నతి కోసం విశేష కృషి చేశారని కొనియాడారు. మార్కాపురం సమీపంలోని దరిమడుగు వద్దగల డాక్టర్ శామ్యూల్ జార్జి ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలోని జార్జి ఘాట్ వద్ద డాక్టర్ శామ్యూల్ జార్జి వర్ధంతి వేడుకలు ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రి డాక్టర్ సురేష్చ, ఆయన సతీమణి విజయలక్ష్మి, జార్జి ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ ఆదిమూలపు విశాల్, జార్జి కుటుంబీకులు పాల్గొని ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు సభలో మంత్రి డాక్టర్ సురేష్ మాట్లాడారు. విలువలతో కూడిన విద్యను అందించడమే జార్జికి ఘనమైన నివాళి అని తెలిపారు. వెనుకబడిన ప్రాంతంలో వెనుకబడిన వర్గాల్లో సాంకేతిక విద్యను అందుబాటులోకి తీసుకువస్తే ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ఉపాధి అందుబాటులోకి వస్తుందన్న ఆలోచనతో ఈ ప్రాంతంలో జిల్లాలోనే మొదటి సారిగా ఇంజినీరింగ్ కళాశాలను మార్కాపురంలో నెలకొల్పినట్లు తలిపారు. వేలాది మంది పేద విద్యార్థులు ఈ కళాశాలలో చదువుకుని... ఉన్నతమైన ఉద్యోగాల్లో స్థిర పడ్డారన్నారు. అనంతరం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ సిహెచ్.రాజబాబు తదితరులు పాల్గొన్నారు.



అద్దంకిలో విశ్వకర్మ జయంతి వేడుకల్లో అన్నదానం

ఘనంగా విశ్వకర్మ జయంతి

ప్రజాశక్తి - అద్దంకి

విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో శ్రీ విరాట్ విశ్వకర్మ జయంతి మహెూత్సవం శ్రీ కమటేశ్వర స్వామి దేవాలయంలో ఆదివారం పూజా కార్యక్రమంతో ప్రారంభించారు. విశ్వకర్మ పతాక ఆవిష్కరణ, మహా యజ్ఞం, పూర్ణాహుతి జరిగాయి. వేద పురోహితులు కుందుర్తి హనుమాచార్యులు బృందం నిర్వహించిన యజ్ఞంలో ఐదుగురు దంపతులు పాల్గొన్నారు. కుల, మతాలకు అతీతంగా 800మందికి పైగా అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆళ్లగడ్డ వీర సుందరచారి, పొన్నపల్లి మల్లికార్జునరావు, అనంతు మురళీ రామమోహన్రావు, దంతనాల కనక రత్నాచారి, ఉయ్యూరు శ్రీరాములు, గొల్లపాటి వెంకటాచారి, చందవల్లి అన్నపూర్ణ చారి, జల్దీశర్మ, చెన్నుపల్లి ఆంజనేయులు, తెనాలి రామబ్రహ్మం, సోడా సుబ్బారావు, బదరీ నాగులు పాల్గొన్నారు.



విశ్వకర్మ జయంతి వేడుకల సందర్భంగా ప్రత్యేక పూజలు

పంగులూరు : విశ్వబ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో గాయత్రీ సమేత విశ్వకర్మ భగవాన్ జయంతి వేడుకలు ఆదివారం సాయిబాబా కళ్యాణ మండపంలో ఘనంగా నిర్వహించారు. విశ్వకర్మ పూజ, గణపతి పూజ, విశ్వకర్మ భగవానుని యజ్ఞమహెూత్సవం నిర్వహించారు. విశ్వకర్మ పతాక ఆవిష్కరణ చేశారు. అన్నదానం చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు మచ్చా అనంత చారి, విశ్వబ్రాహ్మణ సంఘ మండల అధ్యక్షులు మచ్చా వెంకటేశ్వర్లు, మార్టూరు మండల అధ్యక్షులు ఇంకొల్లు ప్రసాద్, సిద్దు బొల్లాపల్లి, పూసపాటి సాంబశివరావు, చిరంజీవి, రాజేష్, సిద్ది సుబ్బారావు, కోల్లపూడి సురేష్, మేడూరి శ్రీ హర్ష, వినయ్, కుమార్, సాయి, కాజన అప్పయ్య, రఘు పాల్గొన్నారు.



శాఖా గ్రంథాలయంలో విశ్వకర్మ జయంతి వేడుకలు

చీరాల : విశ్వకర్మ జయంతి వేడుకలు స్థానిక గ్రంథాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ నిర్వాహకురాలు మాట్లాడుతూ జిల్లా గ్రంథాలయ సమస్థ కార్యదర్శి ఆదేశాల మేరకు చేతి వృత్తు దారుల ఆరాధ్యదయమైన విశ్వకర్మ జయంతి ఆదివారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విశ్వకర్మ గురించి విద్యార్థులకు వివరించారు. అదేవిధంగా చదవడం – మాకిష్టం అనే కార్యక్రమం ద్వారా విద్యార్థులను పుస్తకాలు చదివించటం జరిగిందని అన్నారు. విద్యార్థులు పుస్తకాలు చదివేందుకు ఎంతో ఆసక్తిని చూపాలని అన్నారు. పుస్తకాలు చదవటం ద్వారానే మేధోశక్తి అభివృద్ధి చెందుతుందని అన్నారు.

మంత్రి నాగార్జున శుభాకాంక్షలు

ప్రజా శక్తి - బాపట్ల జిల్లా

వినాయక చవితి పండగ సందర్భంగా సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున, రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకట రమణరావు, పార్లమెంటు సభ్యులు నందిగం సురేష్, ఎమ్మెల్సీలు ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, పోతుల సునీత, జిల్లా కలెక్టర్ పి రంజిత్ బాషా ప్రజలకు ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. వినాయక చవితి పండుగను ప్రజలు సుఖ సంతోషాలతో జరుపుకోవాలని కోరారు.

సా...గుతున్న డ్రైనేజీ పనులు

ప్రజాశక్తి - చెరుకుపల్లి

డ్రైనేజీ నిర్మాణం కోసం రోడ్లకు అడ్డంగా తవ్విన గుంటలు పూడ్చకుండా వదిలేశారు. జాతీయ రహదారి నిర్మాణ పనులు చేస్తున్న కాంట్రాక్టర్ అడ్డదిడ్డంగా రహదారులు వెంబడి గుంటలు తవ్వి ప్రజలకు నరకం చూపిస్తున్నారు. 216ఏ జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా చెరుకుపల్లి సెంటర్లో రోడ్డు నిర్మాణం, డ్రైనేజీ పనులు సంవత్సరాలుగా చేస్తూనే ఉన్నారు. నిర్మాణ గుత్తేదారు గ్రామంలోని ప్రధాన రహదారుల వెంబడి గుంటలు తవ్వి రోడ్లను మూసివేశారు. దీంతో గ్రామస్తులు, పరిసర



రోడ్డుకోసం తవ్వి వదిలేసిన కాలువలతో ప్రజలకు ఇబ్బందులు

గ్రామాల ప్రజలు ఎక్కువ దూరం తిరిగి రావాల్సి వస్తుంది. పాఠశాల బస్సులు ఎక్కువ దూరం తిరిగి రావడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చెరుకుపల్లి ప్రధాన సెంటర్లో అంబేద్కర్ విగ్రహం రహదారి మధ్యలో ఉండటంతో రోడ్డు నిర్మాణ పనులు ఆగిపోయాయి. ట్రాఫిక్ సమస్య నెలకొని ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలం కావడంతో నీటిపారుదల లేక, అంతర్గత రహదారులలో మురుగునీరు నిలబడి దోమలు, దుర్గంధంతో ప్రజలు అల్లాడుతున్నారు. ఇప్పటికైనా జాతీయ నిర్మాణ సంస్థ అధికారులు వెంటనే పనులు పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కక్షపూరితంగా చంద్రబాబుపై అక్రమ కేసులు

ఎమ్మెల్యే అనగాని సత్య ప్రసాద్

ప్రజాశక్తి - రేపల్లె

ప్రజల స్వేచ్ఛ, హక్కుల కోసం చంద్రబాబు పోరాడుతున్నారని ఎమ్మెల్యే అనగాని సత్య ప్రసాద్ అన్నారు. రాజకీయ కుట్రతోనే అరెస్టు చేశారని ఆరోపించారు. రిలే దీక్షా శిబిరంలో ఆదివారం మాట్లాడారు. రాష్ట్ర విభజన అనంతరం పారిశ్రామిక ప్రాంతమంతా హైదరాబాదులో ఉండిపోవడంతో రాష్ట్ర యువత భవిషత్ ను తీర్చిదిద్దాలని నిరుద్యోగులైన యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు నైపుణ్య శిక్షణా తరగతులను ఏర్పాటు చేశారని అన్నారు. సీమెన్స్, డిజైన్టెక్ సంస్థలతో ఒప్పందం కుదుర్చుకుని స్కిల్ డెవలప్మెంట్ శిక్షణా తరగతులు నిర్వహించినట్లు తెలిపారు. ఆర్థిక శాఖ కార్యదర్శి అజయ్ కల్లం క్యాబినెట్ తీర్మానంతో యువత భవిష్యత్ కు పునాదులు వేసి అభివృద్ధి చెయ్యటమే చంద్రబాబు చేసిన అవినీతా అని ప్రశ్నించారు. స్కిల్ డెవలప్మెంట్ కేసులో ఎటువంటి కుట్రలు లేవని ఆ సంస్థ ఎండి సుమన్ బోస్ పత్రికా ముఖంగా వెల్లడించారని చెప్పారు. 2లక్షల మంది శిక్షణ పొందగా 72వేల మంది మంచి స్థాయిలో సాఫ్ట్ వేర్లుగా ఉద్యోగాలు పొందారని చెప్పారు. జగన్మోహన్‌రెడ్డి సీఐడీ అధికారులను తన ఇంట్లో పనిమనుషులుగా మార్చి అక్రమ కేసులు పెట్టిస్తున్నారని ధ్వజమెత్తారు. 38కేసుల్లో ముద్దాయిగా ఉండి, ఏ1 ముద్దాయిగా ఉన్న జగన్మోహన్‌రెడ్డి తాను 16 నెలలు జైల్లో ఉన్నాను కాబట్టి ప్రతిపక్ష నాయకులు క్లీన్‌గా ఉండకూడదనే దురుద్దేశంతో బాబుపై అక్రమ కేసులు



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎల్ఎ సత్యప్రసాద్

పెట్టారని అన్నారు. ఏపీ రాజకీయాల్లో అత్యంత కీలకంగా చంద్రబాబు వ్యవహరిచారని గుర్తు చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, నవ్యాంధ్రప్రదేశ్‌లలో 14ఏళ్ళ సీఎంగా పనిచేసిన వ్యక్తిని జైలులో పెట్టి ఇబ్బందులు పెడుతుంటే తెలుగు ప్రజల హృదయాలు రగిలిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో శాంతి బద్రతలు క్షీణించాయని అన్నారు. కేసులు, అరెస్టులకు బెదిరేది లేదన్నారు. రానున్న ఎన్నికల్లో టిడిపి అధికారానికి వస్తుందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంఎల్ఎ ముమ్మనేని వెంకట సుబ్బయ్య, పంతాని మురళీధరరావు, గూడపాటి శ్రీనివాసరావు, గోగినేని వసూద, జీవి నాగేశ్వరరావు, వెనిగళ్ళ సుబ్రహ్మణ్యం, ధర్మతేజ పాల్గొన్నారు.

ప్రతిపక్షంపై కక్షసాధింపు



నిరసన దీక్షల్లో టిడిపి నేతలు

తప్పుడు ఆరోపణలతో చంద్రబాబును అరెస్టు చేశారని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గూడపాటి శ్రీనివాసరావు అన్నారు. అరెస్టుకు నిరసనగా దీక్షలు చేశారు. చెరుకుపల్లి, రేపల్లె రూరల్ టీడీపీ నేతలు దీక్షలో కూర్చున్నారు. న్యాయ సూత్రాలు పాటించకుండా చంద్రబాబుపట్ల మాఅమర్యాదగా వ్యవహరించడం సరికాదన్నారు. జగన్‌కున్న అవినీతి మరకలు అందరికీ అంటించాలని అనుకుంటున్నారని ఆరోపించారు. స్కిల్ డెవలప్‌మెంట్‌లో అవినీతి జరిగినట్లు ఆధారాలే లేవని అన్నారు. పోలీస్ యాక్టు వైసీపీ మూకలు వర్తించదా అని ప్రశ్నించారు. కాపులను టీడీపీకి దూరం చెయ్యాలనే ఉద్దేశ్యంతో వంగవీటి మోహన్ రంగా గురించి మోపిదేవి వెంకటరమణ మాట్లాడటం సిగ్గుచేటన్నారు. రంగను హత్యచేసిన వాళ్లు ఏపార్టీలో ఉన్నారో ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో అనగాని శివ ప్రసాద్, టీడీపీ చెరుకుపల్లి మండల అధ్యక్షులు మల్లాది రామకృష్ణ, రేపల్లె మండల అధ్యక్షులు రామాంజనేయులు, వడ్డీ లక్ష్మోజీ, ఆర్ సురేష్, శివరామకృష్ణ, పార్థసారథి, రాంబాబు, కుమారస్వామి, వెనిగళ్ళ సుబ్రహ్మణ్యం, టీధర్మతేజ పాల్గొన్నారు.

మట్టి వినాయక ప్రతిమలు పంపిణీ

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

వినాయక చవితి సందర్భంగా పర్యావరణాన్ని పరిరక్షించే విదంగా మట్టి గణనాథుల విగ్రహాలతోనే పూజించాలనే ఆశయంతో స్థానిక రాయల్ విద్యా సంస్థల కరస్పాండెంట్ పేరం రవీంద్రబాబు, స్వప్న ఆధ్వర్యంలో 2000పైగా మట్టి విగ్రహాలు తయారుచేసి ఆదివారం మార్టూరులో విద్యార్థులు, స్థానికులకు పంపిణీ చేశారు. ఉపాధ్యాయులు తయారుచేసిన గణనాథుని మట్టి ప్రతిమలు చూపరులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. గత మూడు సంవత్సరాలుగా వినాయక మట్టి ప్రతిమలు పంపిణి చేస్తున్నట్లు పేరం రవీంద్రబాబు తెలిపారు. కార్యక్రమంలో రాయల్ స్కూల్ ఇంచార్జ్ కుడారి మధుబాబు, హెచ్ఎం డీవీ బాలసుబ్రహ్మణ్యం, కోటేశ్వరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. మట్టి వినాయక బొమ్మలను మాత్రమే పూజకు ఉపయోగించాలని రోటరీ అధ్యక్ష, కార్యదర్శులు తాళ్లూరి సాంబశివరావు, మద్దుమాల కోటేశ్వరరావు కోరారు. మట్టి వినాయక విగ్రహాలను పంపిణి చేశారు. కార్యక్రమంలో



మార్టూరులో మట్టి ప్రతిమల పంపిణీ

అసిస్టెంట్ గవర్నర్ ఇంటూరి ఆంజనేయులు, ష్టి మోహనరావు, రావి అంకమ్మచౌదరి, మురకొండ ఈశ్వం ప్రసాద్, శానంపూడి లక్ష్మయ్య, అలపర్తి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వేటపాలెం : మట్టి వినాయకులను పూజించి, పర్యావరణ పరిరక్షణకు సహకరించాలని రోటరీ వ్యవస్థాపక



వేటపాలెంలో మట్టి ప్రతిమల పంపిణీ

అధ్యక్షులు గొల్లపూడి సీతారాం కోరారు. స్థానిక రైల్వే స్టేషన్ రోడ్డులోని రోటరీ కమ్యూనిటీ హాల్లో 600 మట్టి వినాయక ప్రతిమలను ఉచితంగా అందజేశారు. ప్రతిచోట కాలుష్యం కోరలు చేస్తుందని అన్నారు. మట్టి వినాయకులను ప్రతిష్టించి, కొలిచినట్లయితే కొంతమేరకు పర్యావరణాన్ని పరీక్షించిన వారమవుతామని



బాపట్లలో మట్టిప్రతిమలు పంపిణీ

అన్నారు. కార్యక్రమంలో రోటరీ అధ్యక్షులు బట్టమోహనరావు, కార్యదర్శి ఏవి సురేష్, కోశాధికారి టి కోటేశ్వరరావు, డాక్టర్ శివరామకృష్ణ, కొత్త వాసు, బండారు రాజేష్, పత్తి వెంకట సుబ్బారావు, పొగడదండ రవికుమార్, ఖదీర్ భాష, నారాయణ నాగభూషణం, పింజల ప్రసాద్ పాల్గొన్నారు.

బాపట్ల : వినాయక చవితికి మట్టి ప్రతిమలను వినియోగించాలని పట్టణ సీఐ వెంకటేశులు అన్నారు. స్థానిక గడియార స్తంభం సెంటర్లో రియల్ ఎస్టేట్ వ్యాపారి గంటా నవీన్ ఆధ్వర్యంలో వినాయక మట్టి ప్రతిమలను ఆదివారం పంపిణీ చేశారు. ప్రతి ఒక్కరూ మట్టి ప్రతిమలనే వినియోగించి కాలుష్యం నుండి ప్రకృతిని పరిరక్షించాలని కోరారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ నీటి కాలుష్యం చేస్తుందని అన్నారు. వాడవద్దని సూచించారు.

గణపతి పూజకూ ధరల ఘాటు

ప్రజాశక్తి - బాపట్ల



అమ్మకానికి సిద్ధం చేసిన పత్రి, ఫలాలు

గణనాథుని పూజ సామాగ్రి ధరలు గణనీయంగా పెరిగాయి. వినాయక చవితి పండుగను పురస్కరించుకొని ఆదివారం పట్టణంలోని రథం బజార్లో గణపతి పూజా సామాగ్రి పత్రి, పుష్పం, ఫలాలను విక్రేతలు సిద్ధం చేశారు. ఈ యేడు పూజకు అవసరమైన మారేడు, వెలగ, సీతాఫలం, మామిడి కాయల రేట్లు అధికంగా ఉన్నాయని విక్రేతలు తెలిపారు.

ఆలనాపాలనా లేని ప్రభుత్వ భవనాలు

- శిథిలావస్థకు చేరిన వైనం
- పట్టించుకోని పాలకులు, అధికారులు
- నిర్మాణం పూర్తయినా నిరుపయోగం



ప్రారంభం కాకముందే నెర్రెలిచ్చిన హాస్టల్ భవనం



శిథిలమైన ఎన్ఎస్‌పి కార్యాలయ భవనం

ప్రజాశక్తి - ఇంకొల్లు రూరల్

శిథిలావస్థకు చేరిన ప్రభుత్వ భవనాలను పట్టించుకునే నాథుడు కరువయ్యాడు. భయం గుప్పిట్లో సిబ్బంది కార్యాలయాల్లో విధులు నిర్వహిస్తున్నారు. మరి కొన్ని కార్యాలయాలు శిథిలావస్థకు చేరి కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. బిసి బాలుర వసతి గృహం మాత్రం ప్రారంభం కాకుండానే నెర్రెలు ఇచ్చి వెక్కిరిస్తూ ఉంది. సాక్షాత్తు ఎంపిడిఒ కార్యాలయం లేక వెలుగు ఆఫీసు పంచలో తల దాచుకుంటున్నారు. పురాతన ఎంపిడిఓ కార్యాలయంలో ఎన్ఆర్‌జిఎస్ కార్యాలయం ఏర్పాటు చేసుకొని కాలం వెళ్ళదీస్తున్నారు. విషసర్పాలు, పాములు తిరుగుతుండటంతో భయం గుప్పిట్లో విధులు పని చేస్తున్నారు. బిసి బాలుర వసతి గృహం నిర్మించినప్పటికి ప్రారంభాకి నోచుకోలేదు. పగుళ్ళిచ్చి వెక్కిరిస్తూ ఉంది. కాంట్రాక్టర్ చేసిన నిర్వాకానికి భవనం అలాగే ఉండి పోయింది. అసాం ఘిక కార్యక్రమాలకు వేదికగా మారింది. నాగార్జున సాగర్ ప్రాజెక్టు కార్యాలయం కూలేందుకు సిద్ధంగా ఉంది. అధికారులు అందుబాటులో ఉండరు. ఉద్యోగులు కూడా తలో దిక్కులో వివిధ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. జీతాలు మాత్రం నెల నెలా తీసుకుంటున్నారు. ఇదిలా ఉండగా ప్రభుత్వం భవనాలకు నిధులు మంజూరు చేయక కాంట్రాక్టర్లు, నాయకులు, కార్యకర్తలు లబోదిబో అంటున్నారు. మండలానికి ఇంజనీర్లు కరువయ్యారు. డిప్యుటేషన్‌పై వచ్చి కొన్ని రోజులు పనులు చేయటం, మరలా సొంత గూటికి చేరటం అధికారుల తంతుగా మారింది. పిఆర్ ఇంజనీరు లేక ఈ ప్రభుత్వంలో చేసిన పనులకు బిల్లులు రాక కాంట్రా క్టర్లు అల్లాడి పోతున్నారు. మండల పరిషత్ సర్వ సభ్య సమావేశంలో గత నాలుగు సంవత్సరాల నుండి ఏకరవు పెడుతున్నా వారి సమస్యలు వినే నాథుడు లేడు. తెచ్చిన అప్పులకు వడ్డీలు కడుతూ కాలం వెళ్ళతీస్తున్నారు. సొంత పార్టీలో ఉండి ఏమి చేయలేక అల్లాడిపోతున్నారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో బిల్లుల పరిస్థితి ఏమిటనేది ప్రశ్నార్థకంగా మారింది. ఒక వేళ వచ్చే ఎన్నికల్లో ప్రభుత్వం మారితే వీరి సంగతి ఏమిటని మనో వేదనకు గురవుతున్నారు.

టిడిపి దీక్షలకు జనసేన మద్దతు

- కారంచేడులో చేతికి సంకెళ్లతో నిరసన
- కొనసాగుతున్న నిరసన దీక్షలు
- వెంటాడుతున్న పోలీసు నిర్బంధం

ప్రజాశక్తి - బాపట్ల

చంద్రబాబు అరెస్టుకు నిరసనగా టిడిపి ఇన్‌ఛార్జి వేగేశన నరేంద్ర వర్మ ఆధ్వర్యంలో మహిళా కార్యకర్తలు ఆదివారం రిలే నిరాహార దీక్ష చేశారు. ఈ సందర్భంగా వర్మ మాట్లాడుతూ చంద్రబాబు జైలు నుండి త్వరగా విడుదుల కావాలని దేశం నలు మూలల నుండి ప్రజలు మద్దతు తెలుపుతున్నారని అన్నారు. చంద్రబాబు అరెస్టుతో జగన్ నిజరూపం బయటపడిం దని అన్నారు. రానున్న ఎన్నికలో టిడిపి, జనసేన కలయికతో వైసిపి చిత్తుగా ఓడిపోవడం ఖాయమన్నారు. దీక్షలో ఉమ్మడి గుంటూరు జిల్లా జనసేన సంయుక్త కార్యదర్శి నామన శివన్నారాయణ సంఘీభావం తెలిపారు. టిడిపి, జన సేన కలిసి 175 స్థానాల్లో విజయం సాధిస్తామని అన్నారు. కార్యక్రమంలో జనసైని కులు గోగన ఆదిశేషు, ఊస ప్రసాద్, ఇమ్మ డిశెట్టి మురళికృష్ణ, మాధురి, దేవిరెడ్డి శ్రీనివాస రావు, అసిత్, నామన శ్యాం, సుధాకర్, తెలుగు మహిళలు పల్లం సరోజిని, నన్నపనేని సులోచన, హబు న్నిసా, ఝాన్సీ, సావిత్రి, శ్రీదేవి, సునీత, విజయ, కట్టా సుజాత, గుణ్ణం పిచ్చమ్మ, నక్కల వెంకట కుమారి, గౌతమి సుజాత, పద్మ సంధ్యా రాణి, ఇస్తేరు, లక్ష్మి, సుజాత, రాణి, నజ్మా, ఝాన్సీ, రాణి, నవనీతం, శ్రీవల్లి, రజనీ, కుమారి, రమాదేవి పాల్గొన్నారు. దీక్షలో కూర్చున్న మహిళలకు వర్మ ఆదివారం నిమ్మరసం ఇచ్చి విరమింపజేశారు.



కారంచేడులో చేతికి సంకెళ్లతో నిరసన

భట్టిప్రోలు : చంద్రబాబు అరెస్టుకు నిరసనగా చుండూరు ప్రధాన కూడలిలో ఎడ్లపాడు టిడిపి నేతలు నిరాహార దీక్ష చేశారు. దీక్షలో మాజీ మంత్రి నక్కా ఆనందబాబు మాట్లాడుతూ చంద్రబాబు అరెస్టు అక్రమమని అన్నారు. మన రాష్ట్ర ప్రజలతో పాటు తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల నుండి ఐటీ ఉద్యోగులు సైతం నిరాహార దీక్షలు, రాస్తారోకోలు చేపట్టటం బాబు అవినీతి పరుడు కాదనేది రుజువు చేస్తుందన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ప్రజా సమస్యల నుండి దృష్టి మరల్చేందుకే జగన్‌రెడ్డి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని అన్నారు. అరెస్టులు, అక్రమ కేసులు టిడిపి విజయాన్ని ఆపలేవన్నారు. అత్యుత్సాహం చూపుతున్న పోలీసులు మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరిం చారు. కార్యక్రమంలో తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు నన్నపనేని రాజకుమారి, స్థానిక టిడిపి నేతలు, మహిళలు పాల్గొన్నారు.

చీరాల : రాజకీయ కుట్రతోనే చంద్రబాబును రిమాండ్ పంపించారాని టిడిపి యువనేత గౌరీ అమర్నాద్ అన్నారు. టిడిపి ఇన్‌ఛార్జి ఎంఎం కొండయ్య ఆధ్వర్యంలో స్థానిక టిడిపి కార్యాలయంలో ఆదివారం దీక్షలు చేశారు. ఎలాంటి అధారాలు, పిర్యా దులు లేకుండా చంద్రబాబుపై అక్రమ కేసులు పెట్టారని అన్నారు. ప్రజలు సంయమనం పాటిస్తున్నారని అన్నారు. ఓటుతో వచ్చే ఎన్నికల్లో వైసిపికి బుద్ధి చెబుతారని అన్నారు. దీక్షను ఆదివారం సాయంత్రం నిమ్మరసం ఇచ్చి విరమింపజేశారు. దీక్షల లో నాతాని ఉమామహేశ్వరరావు, షేక్ యాసిన్, గొట్టిపాటి రామారావు,షేక్ మొహిద్దిన్, షేక్ కరిముల్లా, షేక్ లాల్ అహ్మద్, షేక్ గౌసాని, దూదేకుల నజీర్, సయ్యద్ సర్దార్, షేక్ బాజీ, షేక్ రజాక్, షేక్ ఫర్వాన, షేక్ ధరీషా పాల్గొన్నారు.

కారంచేడు : చంద్రబాబు అక్రమ అరెస్టు నిరసిస్తూ చేతికి సంకెళ్లు వేసుకుని మహిళలు ఆదివారం దీక్ష చేశారు. దీక్షలో ఎఎంసి మాజీ చైర్మన్ యార్లగడ్డ అక్కయ్య చౌదరి, పోతిని వెంకటేశ్వర్లు, కంబంపాటి నరేంద్ర, తాళ్లూరి అనిల్ కుమార్, పాతూరి ఆదిలక్ష్మి పాల్గొన్నారు.



బట్టిప్రోలులో టిడిపి నిరసన దీక్షలు

పద్మనాభరావుకు సాహితీ పురస్కారం

ప్రజాశక్తి - అద్దంకి

స్థానిక రామసుశీల నిలయంలో ఆదివారం జరిగిన పుట్టంరాజు బుల్లెయ్య, రామలక్ష్మమ్మ సాహిత్య పురస్కార సభకు వారణాసి రఘురామశర్మ అధ్యక్షతవహించారు. కవిగా, అవధానిగా, అనువాదకునిగా, కథారచయితగా, నవలారచయితగా, పరిశోధకునిగా, జీవిత చరిత్రకారుడిగా, వ్యాఖ్యాతగా, రేడియో, దూరదర్శిని సృజనాత్మక కార్యక్రమాల రూపశిల్పిగా, ఐఎస్ విద్యార్థుల శిక్షకులుగా అనంత ప్రతిభాపాటవ మూర్తి రేవూరి అనంత పద్మనాభరావుకి పురస్కారం ఇవ్వడం ద్వారా వాగ్దేవిని గౌరవించడమేనని సభాప్రారంభకులు, పురస్కార ప్రదాత పుట్టంరాజు శ్రీరామచంద్ర మూర్తి పేర్కొన్నారు. కవి డివిఎం సత్యనారాయణ మాట్లాడుతూ పద్మనాభరావు సేవలను సభకు తెలిపారు. దూరదర్శన్‌లో అత్యున్నతమైన అదనపు డైరక్టర్ జనరల్‌గా అద్భుతమైన కార్యక్రమాలు రూపకల్పన చేశారని అన్నారు. 21వ ఏటనే అవధానాన్ని ప్రారంభించి, యాభైకిపైగా అవధానలు చేశారని అన్నారు. పివి గిరి, ప్రకాశం పంతులు, దుర్గాభాయ్ దేశముఖ్,



పద్మనాభరావును సన్మానిస్తున్న ప్రతినిధులు

శంకరంబాడి సుందరాచారి జీవిత చరిత్రలు రాశారని అన్నారు. 10కిపైగా ఆంగ్ల గ్రంథాలను తెలుగులోకి అనువదించారని అన్నారు. 'మార్నింగ్ ఫేస్ 'గ్రంథానికి తెలుగు విశ్వవిద్యాలయ అనువాద పురస్కారం లభించిందని అన్నారు. భారతీయ సుప్రసిద్ధ గ్రంథాలు అనే ఆయన రచన తెలుగుసాహిత్యానికి నిలువుటద్దమని అన్నారు. రూ.10వేలు పురస్కార నగదు, పట్టువస్త్రాలు సమర్పించారు. పురస్కారం అందుకోవడం ప్రసన్నాంజనేయస్వామి ప్రసాదంగా భావిస్తున్నట్లు అనంత పద్మనాభరావు అన్నారు. ఆదివారం పుట్టిన రోజు జరుపుకుంటున్న పంకజ్ పార్థును ఆహూతులు ఆశీర్వదించారు. కార్యక్రమంలో సాహితీ మిత్రమండలి అధ్యక్ష, కార్యదర్శులు లక్కరాజ చంద్రశేఖర్, కెవి పోలి రెడ్డి, చుండూరి మురళీసుధాకరరావు, డాక్టర్ యు దేవపాలన, ఆర్‌వి రాఘవరావు, చప్పిడివీరయ్య, వామరాజు వెంకటేశ్వర్లు, ఇలపావులూరి శేష తల్పశాయి, లక్కరాజు విశ్వమోహన్, కొండకావూరి కుమార్, ఓరుగంటి శ్రీనివాసరావు, కంఠంరాజు శివరామ కోటేశ్వరరావు, గోపినాథం హరనాథ్, కూరపాటి రామకోటేశ్వరరావు, షేక్ మస్తాన్, పిసిహెచ్ కోటయ్య, జాగర్లమూడి ప్రతాప్, జమ్మలమడక హనుమంతరావు, బాచిన పూర్ణచంద్రరావు, దివి లింగయ్య నాయుడు, వీరవల్లి రుద్రయ్య, చిన్నిమురళీకృష్ణ, మారం కోటేశ్వరరావు, నారాయణ బాలసుబ్రహ్మణ్యం, అళహరి హరిబాబు, అంజాద్ భాష, లాయర్ రమేష్, మహమ్మద్ రఫీ, అంజాద్ భాష పాల్గొన్నారు.



విలేకర్ల సమావేశంలో గొట్టుముక్కల బాలాజీ

28న చేతివృత్తుదారుల సమావేశం

ప్రజాశక్తి - భట్టిప్రోలు

విజయవాడ దాసరి భవనంలో ఈనెల 28న చేతుదారుల సమైక్య సంఘ సమావేశం జరుగుతుందని సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు గొట్టుముక్కల బాలాజీ తెలిపారు. ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాలకుల విధానాల కారణంగా చేతి వృతుదారులు ఉపాధి కోల్పోయి వలసలు వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడిందని అన్నారు. వృత్తి పనుల్లో సరైన పని లేక పస్తులు ఉంటున్నారని అన్నారు. వీరి సమస్యల పరిష్కారం కోసం అనుసరించాల్సిన విధివిధానాలను సమావేశంలో చర్చించనున్నట్లు తెలిపారు. సమావేశానికి సిపిఐ రాష్ట్ర నాయకులు జెవి సత్యనారాయణ, కె రామాంజనేయులు హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు బి శ్రీనివాసరావు, వి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



రామాపురం సముద్ర తీరంలో శుభ్రం చేస్తున్న ప్రతినిధులు

అడవుల సంరక్షణకు ప్రత్యేక చర్యలు

ప్రజశక్తి - చీరాల

తీర ప్రాంతంలో మడ అడవుల పెంపకం, వాటి సంరక్షణ గురించి ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు బాపట్ల జిల్లా అటవీ అధికారి ఎల్ భీమయ్య తెలిపారు. సముద్రతీర పరిశుభ్రత కార్యక్రమాన్ని ఆంధ్ర ప్రదేశ్ అటవీ శాఖ, చెన్నై ట్రీ ఫౌండేషన్ సహకారంతో రామాపురంలో ఆదివారం నిర్వహించారు. వాడరేవు సమీపంలో ఉన్న నగరవనంలో చేపడుతున్న పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏటా ఆలివ్ రిడ్లే తాబేళ్ల సంరక్షణలో ట్రీ ఫౌండేషన్ చేస్తున్న కృషి అభినందనీయమని అన్నారు. జీవవైవిద్యాన్ని పరిరక్షించాలంటే సముద్రంలో ప్లాస్టిక్ వ్యర్థాలు కలవకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. నేషనల్ గ్రీన్ కోర్ జిల్లా సమన్వయ కర్త పవని భానుచంద్రమూర్తి మాట్లాడుతూ భూమండలంపై ఏటా సుమారు మూడున్నర కోట్ల టన్నుల ప్లాస్టిక్ కాలుష్యం పేరుకుపోతుందని అన్నారు. అందులో నాలుగోవంతు దాకా సముద్ర జలాల్లోకి చేరుతుందని గణాంకాలు చెబుతున్నాయని అన్నారు. సముద్ర జలాలు ఉప్పగానే కాదు యాసిడ్ లాగా కూడా మారతాయని ఆందోళన వ్యక్తం చేశారు. అటువంటి నీటిలో జీవులు బతకలేవని అన్నారు. కార్యక్రమంలో ట్రీ ఫౌండేషన్ చీరాల ప్రతినిధి శవనం చంద్రారెడ్డి, సెక్షన్ ఆఫీసర్ జాన్సన్, బీట్ ఆఫీసర్ రాగమ్మ పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య పరిరక్షణపై అవగాహన

ప్రజాశక్తి - కర్లపాలెం

ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్య వేదిక గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని కమిటీ అధ్యక్షులు శవనం శ్రీనివాసరెడ్డి అన్నారు. స్థానిక పెద్దింటి తల్లి దేవస్థానం ఆవరణలో ఐక్యవేదిక సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ఐక్యవేదిక సభ్యత్వ నమోదు చేయాలన్నారు. ఐక్యవేదిక గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. ప్రజల హక్కుల గురించి తెలియజేయాల్సిన అవసరం ఉందని అన్నారు. సెప్టెంబర్ నెలలో ఐక్యవేదిక బహిరంగ సభ నిర్వహిస్తామని తెలిపారు. మండల ఉపాధ్యక్షులు దిండి మస్తాన్‌రెడ్డి, కార్యదర్శి ఓబాధ్యా పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న జడ్‌పి చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే సుధాకర్‌బాబు

అనారోగ్యంతో జడ్‌పిటిసి భాగ్యలక్ష్మి మృతి

ప్రజాశక్తి- మద్దిపాడు

మద్దిపాడు జడ్‌పిటిసి తేళ్ల భాగ్యలక్ష్మి (40) అనారోగ్యంతో ఆదివారం మతి చెందారు. మండల పరిధిలోని అన్నంగి గ్రామానికి చెందిన తేళ్ల భాగ్యలక్ష్మి గత ఐదు నెలలుగా అనారోగ్యంతో బాధపడుతూ ఒంగోలులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆరోగ్య పరిస్థితి విషమించడంతో ఆదివారం మృతిచెందారు. ఈ విషయం గురించి తెలుసుకున్న జిల్లా పరిషత్ చైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే టిజెఆర్. సుధాకర బాబు తదితరులు జడ్‌పిటిసి భాగ్యలక్ష్మి మతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆమె మతి పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేశారు. భాగ్యలక్ష్మి భర్త పుల్లారావుకు ధైర్యం చెప్పి వారి ఇరువురి కుమార్తెలను ఓదార్చారు. నివాళులర్పించిన వారిలో వైసిపి మండల అధ్యక్షుడు మండవ అప్పారావు, ఎంపిపి వాకా అరుణ కోటిరెడ్డి, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపిటిసిలు, వైసిపి నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.



భాగ్యలక్ష్మి(ఫైల్)

వైసిపి ప్రభుత్వం ఒక్క డిఎస్‌సి కూడా వేయలేదు

ఎమ్మెల్సీ కెఎస్. లక్ష్మణరావు



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణరావు

ప్రజాశక్తి -కనిగిరి

ఒక్క డిఎస్‌సి కూడా వేయలేని ఏకైక ప్రభుత్వం వైసిపి ప్రభుత్వం అని ఎమ్మెల్సీ కెఎస్. లక్ష్మణరావు విమర్శించారు. కనిగిరి ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో యుటిఎఫ్ విద్య వైజ్ఞానిక సదస్సు షేక్ ఖాజా రహమతుల్లా అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ లక్ష్మణరావు మాట్లాడుతూ ప్రాథమిక హక్కులు కూడా తీర్చలేనిస్థితిలో పాలకులు ఉన్నారన్నారు. ఎన్ఇపి 2020 పాలసీని రాష్ట్ర ప్రభుత్వాలతో చర్చించకుండానే మోడీ ప్రభుత్వం అమలు చేయాలని చూస్తుండగా యుటిఎఫ్ వ్యతిరేకిందన్నారు. విద్యా వ్యవస్థపై ఆధిపత్యం చెలాయించేలా, వ్యాపారమయం చేసేలా, మత తత్వాన్ని చూపించేలా మోడీ ప్రభుత్వం వ్యవహరిస్తుందన్నారు. ఈపాలసీని అమలు చేయమని ఈపాటికి కేరళ, తమిళనాడు కర్ణాటక రాష్ట్రాలు తీర్మానాలు చేశాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు వ్యతిరేకించడం లేదని ఆయన ప్రశ్నించారు. ప్రాథమిక విద్య, పాఠశాల వ్యవస్థను నిర్మూలించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా చేసుకుందన్నారు. సిపిఎస్ వద్దు, ఒపిఎస్ అమలు చేయాలని పోరాడుతున్నామని పేర్కొన్నారు. సామాజిక స్పహతో పేద విద్యార్థులకు విద్యా ఫలాలు అందేలా ఉపాధ్యాయులు కషి చేయాలని సూచించారు. రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ చైర్మన్ చింతలచెరువు సత్యనారాయణ రెడ్డి మాట్లా డుతూ తాను ఉపాధ్యాయ కుటుంబానికి చెందిన వ్యక్తినని తెలిపారు. ఇస్రో చేసే ప్రయోగాలకు పరికరాలను అందజేస్తూ తాను భాగస్వామి కావడం సంతోషంగా ఉందన్నారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి మాట్లా డుతూ ప్రభుత్వ విద్యారంగాన్ని ప్రైవేటు సంస్థలకు కట్టపెట్టేలా వ్యవహరిస్తూ ఉపాధ్యాయులపై ఒత్తిడి పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరిస్తుందన్నారు. అనంతరం ఎమ్మెల్సీ లక్ష్మణరావును సత్యనారాయణ రెడ్డి సత్కరించారు. యుటిఎఫ్ నాయకులు సత్యనారాయణరెడ్డిని సత్క రించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్, జడ్‌పిటిసి మడతల కస్తూరి రెడ్డి, ఎంపిపి దంతులూరి ప్రకాశం, యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు, రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు కె.శ్రీనివాసరావు, యుటిఎఫ్ నాయకులు ఎం. వెంకటేశ్వర్ రెడ్డి, వి.మాలకొండారెడ్డి, కె. కృష్ణమూర్తి, ఎన్. రామ చంద్రారెడ్డి, ఒ.వీరారెడ్డి, ఎస్.రవి, పి. బాబురెడ్డి, డి. రామిరెడ్డి, ఎస్. రమణయ్య, .శ్రీనివాసులు, కొండారెడ్డి, .ప్రసాద్‌రెడ్డి, డాక్టర్ వెంకటేశ్వరరెడ్డి, బలరాంరెడ్డి పాల్గొన్నారు.

వ్యాధుల పట్ల అప్రమత్తత అవసరం

- జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రజల చెంతకే ప్రభుత్వ వైద్యం
- అందుబాటులో పాము కాటు వ్యాక్సిన్
- లింగనిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే కఠిన చర్యలు
- ముఖాముఖిలో డిఎంహెచ్ఒ డాక్టర్ విజయమ్మ వెల్లడి



ముఖాముఖి

ప్రజాశక్తి -బాపట్ల

వాతావరణంలో చోటు చేసుకుంటున్న మార్పుల కారణంగా వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఎస్.విజయమ్మ తెలిపారు. జిల్లాలో వైద్య ఆరోగ్యశాఖ ప్రజలు అందిస్తున్న వైద్య సేవలపై ఆమె ప్రజాశక్తి ముఖాముఖిలో వివరించారు. అవన్నీ ఆమె మాటాల్లోనే...

జిల్లాలో 104 ద్వారా ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం నిరంతరం కొనసాగుతోంది. దీంతో డెంగ్యూ కేసులు చాలా వరకు తగ్గుముఖం పెట్టాయి. గడిచిన తొమ్మిది నెలల కాలంలో కేవలం 42 కేసులు మాత్రమే నమోదయ్యాయి. వాటిని రికవరీ చేశారు. ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం ద్వారా 89 మంది ఎంఎల్‌ఒలు, సిహెచ్‌ఒలు ఇంటి వద్దకే వెళ్లి షుగర్, బీపీ పరీక్షలు నిర్వహిస్తారు. దీనికి తోడు సోషల్ అండ్ ప్రివెంటివ్ మెడికల్ ప్రోగ్రాం ద్వారా వైద్య కళాశాలల ప్రత్యేక వైద్యులు శాంపిల్స్ సర్వే ద్వారా కొత్తగా క్షేత్రస్థాయిలో ఆరోగ్య సర్వే నిర్వహిస్తారు. జిల్లాలో 43 ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాలతో పాటు కొత్తగా కొప్పెరపాడు, దోనేపూడి, యేల్చూరులో మరో మూడు పిహెచ్‌సిలు కొత్తగా ఏర్పాటు చేశారు. కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు 12 ఉన్నాయి. బాపట్ల, చీరాలలో ఏరియా వైద్యశాలలు, విలేజ్ హెల్త్ క్లినిక్స్, వెల్నెస్ సెంటర్ల ద్వారా ప్రభుత్వ అందించే ఆరోగ్య సేవలను ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు. పర్చూరు, మార్టూరు, అద్దంకి, చీరాల ప్రాంతాల్లో బ్లాక్ లెవెల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు మంజూరయ్యాయి. వాటికోసం స్థల సేకరణ జరుగుతుంది. కొత్తగా ప్రతి మండలానికి రెండు పిహెచ్‌సిల ఏర్పాటు ప్రతిపాదనలను రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ప్రస్తుతం పని చేస్తున్న పిహెచ్‌సితో పాటు కొత్తగా మండల మండలంలో మరో ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాన్నిని ఏర్పాటు చేస్తారు. అవి త్వరలోనే కార్యరూపం దాల్చి ప్రతి మండలంలో రెండు ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాలు అందుబాటులోకి రానున్నాయి. ప్రస్తుతం ఉన్న పిహెచ్‌తో అనుసంధానంగా మరో పిహెచ్‌సిని ఏర్పాటు చేస్తారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో గర్భిణులు అదనపు వ్యయాన్ని భరించి కాన్పు కోసం ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించకుండా ప్రభుత్వ ఆసుపత్రిలోనే కాన్పులు చేయించుకునే విధంగా అన్ని ఏర్పాట్లు చేశారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో జరిగే కాన్పులకు పారితోషకం రూపంలో రూ.5వేలు నగదు అందజేస్తున్నారు. ఈ పథకం పేద, మధ్య,తరగతి ప్రజలకు ఎంతగానో ఉపయోగ పడుతుందన్నారు. గతం కంటే ప్రభుత్వ ఆసుపత్రుల్లో కాన్పుల శాతం గణనీయంగా పెరిగిందన్నారు. మహిళలు గర్భం దాల్చినప్పటి నుంచి ప్రభుత్వ వైద్యశాలల్లో వారికి అవసరమైన మందులు ఉచితంగా అందజేస్తారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం అందజేస్తారు.

ఆరోగ్య సురక్షతో ప్రజల చెంతకే వైద్యం...

ప్రభుత్వ వైద్యాన్ని ప్రజల చెంతకు చేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆరోగ్య రక్ష అనే వినూత్న కార్యక్రమాన్ని చేపట్టింది. ఆరోగ్య కార్యకర్తలు ఆరోగ్యశ్రీ యాప్ 104, 108, 102 ద్వారా సర్వేలు నిర్వహిస్తారు. గ్రామ, పల్లె, పట్టణ ప్రాంతాల్లో ప్రతి ఇంటికి ఎఎన్‌ఎంలు వెళ్లి ఆయా కుటుంబ సభ్యులకు ఏడు రకాల వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. మలేరియా డెంగ్యూ, హెచ్‌బి, మధుమేహం, బిపి, మూత్ర పరీక్షలు చేస్తారు. 15 రోజులు ముందుగా ఈ సర్వే చేస్తారు. మరో పదిహేను రోజులపాటు గ్రామీణ పట్టణ ప్రాంతాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ఇద్దరు ఎంబిబిఎస్ స్థాయి ప్రత్యేక వైద్య అధికారులు ముందుగా నిర్వహించిన వైద్య పరీక్షల్లో ఆరోగ్య సమస్యలున్న వారికి అవసరమైన మందులు ఉచితంగా అందజేస్తారు.

అందుబాటులో పాముకాటు వ్యాక్సిన్

వ్యవసాయ పనులు ప్రారంభిమైన నేపథ్యంలో పాముకాటు, కుక్కకాటుకు అవసరమైన వ్యాక్సిన్‌ను అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలతో పాటు విలేజ్ హెల్త్ క్లినిక్, హెల్త్ వెల్నెస్ సెంటర్లలో అందుబాటులోఉంచారు.

లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే కఠిన చర్యలు.

గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటారు. దీని కోసం జిల్లాలో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. ఎక్కడైనా లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నారని తెలిసిన వెంటనే వైద్యాధికారులు ఆయా కేంద్రాలపై దాడులు నిర్వహిస్తారన్నారు. పరీక్షలు చేస్తున్నది నిజమని తేలితే ఆసుపత్రులు, లింగ నిర్ధారణ సెంటర్లను సీజ్ చేస్తాం.



ప్రారంభోత్సవంలో మంత్రి సురేష్

విద్య,వైద్య రంగాల్లో

విప్లవాత్మక మార్పులు

మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

దేశంలోనే రాష్ట్రాన్ని ఆదర్శవంతంగా అభివద్ధి, సంక్షేమ బాటలో నడిపిస్తూ విద్య, వైద్య రంగంలో విప్లవాత్మకమైన మార్పులకు శ్రీకారం చుట్టిన ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి ప్రజలంతా అండగా ఉండాలని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ తెలిపారు. మండల పరిధిలోని తమ్మడపల్లి గ్రామంలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం మంత్రి సురేష్ మాట్లాడుతూ గత టిడిపి ప్రభుత్వం విద్యా రంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేస్తూ కార్పొరేట్ విద్యా సంస్థలను ప్రోత్సహించినట్లు తెలిపారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలలను నాడు-నేడు పథకంలో కార్పొరేటు ధీటుగా అభివద్ధి చేస్తున్నట్లు తెలిపారు. పౌష్టికాహారంతో కూడిన మధ్యాహ్న భోజనం, జగనన్న విద్యకానుక, అమ్మఒడి, విద్యాదీవెన, వసతి దీవెన, ఫీజు రీయింబర్స్‌మెంట్ లాంటి ప్రథకాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. వైద్య రంగంలోనూ సమూల మార్పులు చేస్తూ పేదవాని గడపకే వైద్యులను తీసుకొస్తున్నారని తెలిపారు. ఫ్యామిలీ డాక్టర్ విధానం దేశానికే ఆదర్శంగా మారిందన్నారు. వైఎస్సార్ విలేజ్ క్లీనిక్స్, అర్బన్ హెల్త్ సెంటర్లు, 104 సంచార వైద్యశాల వంటి వాటితో ప్రజలకు వైద్యసేవలు చేరువ చేశారన్నారు.అనంతరం గ్రామంలో రూ.87 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన సచివాలయం, రైతు భరోసా కేంద్రం, విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి దొంతా కిరణ్‌గౌడ్, జడ్‌పిటిసి చేదూరి విజయభాస్కర్, జిల్లా పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు సయ్యద్ షాబీర్ బాషా, వైసిపి మండల కన్వీనర్ కొప్పర్తి ఓబుల్‌రెడ్డి, వైసిపి నాయకులు గాలి శ్రీనివాసరెడ్డి, శ్రీనివాసరెడ్డి, వివిధ శాఖల అధికారులు, వాలంటీర్లు పాల్గొన్నారు.